Follow: @ANNTELUGU
28-04-2026
ANN తెలుగు
# మహా పత్రిక
మంగళవారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 121 పేజీలు-08 వెల-రూ.1
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## వైద్య రంగంలో తెలంగాణ దేశానికే దిక్సూచి


దేశంలో 50 శాతం వైద్య సేవలు ఇక్కడే అందాలి

అపోలో హాస్పిటల్ నిర్మించిన 'ది హాస్పిటల్ ఆఫ్ గ్రాటిట్యూడ్ ప్రాంభించిన సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, మహా:** దేశంలోని వైద్య రంగంలో 50 శాతానికి పైగా సేవలు తెలంగాణ నుంచే అందించాలన్న గొప్ప లక్ష్యంతో రాష్ట్రంలోని ఆసుపత్రులు అభివృద్ధి చెందాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు. ఇందుకోసం అవసరమైన అన్ని రకాల విధానపరమైన నిర్ణయాలను ప్రభుత్వం తీసుకుంటుందని, వైద్య రంగం అభివృద్ధికి తమ ప్రభుత్వం ఎప్పుడూ అందుబాటులో ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. సోమవారం హైదరాబాద్ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో అపోలో హాస్పిటల్ నిర్మించిన 'ది హాస్పిటల్ ఆఫ్ గ్రాటిట్యూడ్' ను రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహతో కలిసి ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా అపోలో గ్రూప్ వ్యవస్థాపకులు, చైర్మన్ డాక్టర్ ప్రతాప్ సి రెడ్డితో పాటు యాజమాన్యాన్ని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. తెలంగాణను మెడికల్ టూరిజం హబ్‌గా మార్చేందుకు తమ ప్రభుత్వం ఒక ప్రత్యేక పాలసీని తీసుకువచ్చిందని, వైద్య రంగాన్ని అన్ని రకాలుగా ప్రోత్సహిస్తున్నామని ముఖ్యమంత్రి వెల్లడించారు.


మిగతా 2లో

### టాప్ న్యూస్




**ఆంధ్రా యూనివర్శిటీకి రూ.500 కోట్లు**
- ముఖ్యమంత్రి చంద్రబాబు

02



**పోలీసులకు 'బర్త్ డే' గిఫ్ట్**
- పుట్టినరోజు, పెళ్లి రోజున స్పెషల్ లీవ్
- సిబ్బందికి డీజీపీ శివధర్ రెడ్డి కానుక
- రాష్ట్రవ్యాప్తంగా హర్షా తిరేకాలు
- 30న పదవీ విరమణ చేయనున్న డీజీపీ

02



**ఏయూనే నా రాజకీయ పునాది**
- ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

02

# వచ్చే ఎన్నికలు రేవంత్ వర్సెస్ కేసీఆరే

## బీఆర్ఎస్.. చచ్చిన శవంతో సమానం

కేసీఆర్ చావు నేను కోరుకోను

కేసీఆర్ కుటుంబానికి తెలంగాణ ప్రజలతో సంబంధాలు లేవు

ఆయన పార్టీకే భవిష్యత్ లేదు.. కొత్తపార్టీ సంగతి తర్వాత

సీఎం రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు

(హైదరాబాద్ - మహా)

బీఆర్ఎస్ పార్టీ చచ్చిన శవంతో సమానమని, కేసీఆర్ తన శత్రువు కాదని కేవలం రాజకీయ ప్రత్యర్థి మాత్రమేనని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. కేసీఆర్‌కు చెడు జరగాలని కోరుకుంటోంది ఆయన కుటుంబమేనని అన్నారు. కేసీఆర్ కుటుంబానికి, బీఆర్ఎస్ పార్టీకి ప్రజలతో ఎలాంటి సంబంధాలు లేవని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ధ్వజమెత్తారు. కేసీఆర్ కుటుంబమంతా ఒక్కటేనని, రంగు, రుచి లేదని వ్యాఖ్యానించారు. వారు నటిస్తున్నారని మండిపడ్డారు. సోమవారం అసెంబ్లీ ప్రాంగణంలో సీఎం రేవంత్‌రెడ్డి విలేకరులతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. కేసీఆర్ విశ్రాంతిలో ఉన్న ప్రజాప్రతినిధి అని, ఆయన చావును తానెందుకు కోరుకుంటానని సీఎం రేవంత్ అన్నారు. ఆయన ఆరోగ్యంగా ఉంటేనే తమకు మంచిదన్న రేవంత్ రెడ్డి, కేసీఆర్ మర మనిషో కాదో కుటుంబ సభ్యులకే తెలియాలన్నారు. వివక్ష లేని పాలన కాంగ్రెస్‌దని, తమకు ప్రతిపక్షమే లేదన్నారు. వచ్చే ఎన్నికలు కూడా రేవంత్ రెడ్డి వర్సెస్ కేసీఆర్ గానే జరుగుతాయన్నారు. తాము, సీపీఐ, సీపీఎం, టీజేఎస్ కలిసి పోటీచేస్తామన్నారు.

### సీబీఐ విచారణకు ఒత్తిడి

పీసీ ఘోష్ కమిషన్ నివేదికను హైకోర్టు తప్పుపట్టలేదని, కొన్ని సాంకేతిక లోపాలున్నాయని మాత్రమే చెప్పిందని సీఎం అన్నారు. నివేదిక ఆధారంగా చర్యలు వద్దని కోర్టు చెప్పినట్లు తెలిపారు. కాళేశ్వరం అక్రమాలపై సీబీఐ విచారణ తర్వాతే చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని అవకతవకలపై సీబీఐ విచారణ జరపాలని కేంద్రంపై ఒత్తిడి తెస్తామని పేర్కొన్నారు. సీబీఐ వివరాలు కోరితే అన్నీ ఇస్తామని, విచారణ మొదలైతే అన్నీ బయటకు వస్తాయని చెప్పారు. సీబీఐ విచారణ కోరితే కేంద్రం 48 గంటల్లో లోపల వేస్తామన్నారని సీఎం గుర్తు చేశారు. సీబీఐ విచారణ కోరినా కిషన్‌రెడ్డి ఎందుకు మాట్లాడట్లేదు? అని, విచారణకోసం కేంద్రం వద్దకు వెళ్తామని తెలిపారు. ఫోన్ ట్యాపింగ్ కేసు కోర్టు పరిధిలో ఉందని తోసిపుచ్చారు.

### అసెంబ్లీ భవనాలకు నష్టం కలగకూడదు

పార్లమెంట్ తరహాలో అసెంబ్లీ ప్రాంగణం ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. అసెంబ్లీ ప్రాంగణం భద్రతను పటిష్టం చేయాలని ఆదేశించారు. అసెంబ్లీ ప్రాంగణంలో చేపట్టాల్సిన పనులపై అంతకుముందు శాసనమండలి కాన్ఫరెన్స్ హాల్‌లో సీఎం రేవంత్ రెడ్డి, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసన సభ స్పీకర్ ప్రసాద్ కుమార్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం అధికారులకు పలు సూచనలు చేశారు. సభ గౌరవం పెరిగేలా చర్యలు తీసుకోవాలని, మెంబర్స్‌కు మరింత ప్రైవసీ ఉండాలన్నారు. పబ్లిక్ గార్డెన్‌లో మెంబర్స్ కోసం క్లబ్ ఏర్పాటు చేయాలని, ఈ ప్రాంతంలో సభ్యుల కోసం వాకింగ్ ట్రాక్, క్రీడల కోసం ఏర్పాట్లు ఉండాలని తెలిపారు. వచ్చే సమావేశాల నాటికి సెంట్రల్ హాల్ సిద్ధం కావాలన్నారు. హెరిటేజ్ భవనాలకు నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు.

### బీజేపీతో పొత్తుపెట్టుకోనని ఒట్టేస్తావా?

కేసీఆర్‌కు చిత్తశుద్ధి ఉంటే కవిత మాటలకు సమాధానం చెప్పాలని సీఎం రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. కవిత చెబుతున్నట్లు కేసీఆర్ ఎవరి బందీలో ఉన్నారని, కేసీఆర్ మర మనిషా మనసున్న మనిషా అని కవితకు జవాబివ్వాలన్నారు. బీజేపీతో పొత్తు పెట్టుకోనని కేసీఆర్ దేవుడిపై ఒట్టు వేస్తారా? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ఎక్స్‌పైరీ గడువు తీరిందని ఇక ఆ పార్టీతో పనిలేదని విమర్శించారు.



# 31 మందికి టికెట్లు కట్

## ఎమ్మెల్యేలు, ఇన్ ఛార్జిలపై కేసీఆర్ ఆగ్రహం

సిట్టింగ్ లయినా.. సీటు గ్యారంటీ కాదు

సోషల్ మీడియాలో కాదు.. ఫీల్డ్ లో యాక్టివ్‌గా ఉండాలి

నేను ఒకసారి చెబితే.. వెయ్యిసార్లు చెప్పినట్లే

జిల్లాకమిటీలు, అనుబంధసంఘాలు అన్నీ రద్దు

60 లక్షలమంది మెంబర్స్ ఉంటే ఎందుకు ఓడినం

ఢిల్లీలో వెధవలు రాష్ట్రాన్ని అవమానిస్తున్నారు

హైదరాబాద్, మహా


సిట్టింగ్ ఎమ్మెల్యేలైనా పార్టీ ఆదేశాలు పాటించకుంటే టికెట్ కట్ చేస్తానని గులాబీ దళపతి కేసీఆర్ హెచ్చరించారు. బీఆర్ఎస్ సీనియర్ నేతలపై, సిట్టింగ్ ఎమ్మెల్యేలపై పార్టీ అధినేత కేసీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం పార్టీ ఆవిర్భావం సందర్భంగా తెలంగాణ భవన్ లో నిర్వహించిన మినీప్లీనరీలో ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించి ఇంకా బీఎల్ఓ జాబితాను బీఆర్ఎస్ నేతలు సిద్ధం చేయకపోవడంపై కేసీఆర్ అసహనం వ్యక్తం చేశారు. 31 నియోజకవర్గాల నుంచి జాబితా రాలేదని, సభ్యత్వ నమోదులో చురుగ్గా లేకుంటే చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. సిట్టింగ్ లని కూడా చూడనని, టికెట్లు ఇవ్వనని తేల్చిచెప్పారు. '15రోజుల్లో బీఆర్ఎస్ సభ్యత్వ నమోదు కార్యక్రమం జరగాలి. టికెట్ కేటాయింపులకు సభ్యత్వ నమోదు ప్రామాణికం. సోషల్ మీడియాలో యాక్టివ్‌గా కాదు.. ఫీల్డ్‌లో యాక్టివ్‌గా ఉండాలి. సభ్యత్వ నమోదును పట్టించుకోకుంటే సీరియస్ యాక్షన్ ఉంటుంది,. సిట్టింగ్ ఎమ్మెల్యేలు అని కూడా చూడను.. టికెట్ ఇవ్వను. నేను ఒకసారి చెబితే..వెయ్యి సార్లు చెప్పినట్లే' అని హెచ్చరించారు. సభ్యత్వం సరైనోళ్లకు ఇవ్వాలని, రాశి కంటే వాసికి ప్రాధాన్యమివ్వాలన్నారు. 60లక్షలమంది సభ్యత్వం ఉంటే ఎందుకు ఓడామని, అందరూ క్షేత్రస్థాయిలో పనిచేయాలన్నారు.

### బొందలగడ్డగా తెలంగాణ

ఒకప్పుడు అన్ని రంగాల్లో దేశానికే ఆదర్శంగా నిలిచిన తెలంగాణ, నేడు 'బొందలగడ్డ'గా మారుతోందని ప్రజలు ఆవేదన చెందుతున్నారని కేసీఆర్ పేర్కొన్నారు. ముఖ్యమంత్రి, మంత్రుల భాషను చూస్తుంటే జాలి వేస్తోందని, ప్రజల సమస్యలను పరిష్కరించడం చేతకాక చిల్లర కూతలు కూస్తున్నారని ధ్వజమెత్తారు. ధాన్యం కొనుగోలు చేయలేని చేతకానితనంతో రైతులను గోస పెడుతున్నారని, గడిచిన పదేళ్లలో రైతును రాజును చేస్తే, నేడు మళ్లీ రోడ్డున పడేస్తున్నారని అన్నారు. వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఉపనేతలు హరీష్ రావు, తలసాని, సబిత, మధుసూధనాచారి, ప్రధాన కార్యదర్శి జీవన్ రెడ్డి సహా కీలకనేతలంతా ప్లీనరీలో పాల్గొన్నారు.

### ఢిల్లీలో తెలంగాణ ఆత్మగౌరవం తాకట్టు

ఢిల్లీ వీధుల్లో తెలంగాణ ఆత్మగౌరవం తాకట్టు పడుతోందని, పార్లమెంట్‌లో మన గొంతు లేకపోవడం వల్లే 'వెధవలు' కూడా రాష్ట్రాన్ని అవమానిస్తున్నారని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నిప్పులు చెరిగారు. సోమవారం తెలంగాణ భవన్‌లో జరిగిన పార్టీ ఆవిర్భావ వేడుకల్లో ఆయన మాట్లాడుతూ.. బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య వ్యాఖ్యలపై నోరు మెదపని రాష్ట్ర ఎంపీల తీరును తీవ్రంగా ఆక్షేపిస్తూ, తెలంగాణ పౌరుషం కేవలం బీఆర్ఎస్‌తోనే సాధ్యమని ఉద్ఘాటించారు. భారత్‌పాకిస్థాన్ విభజనతో తెలంగాణ ఏర్పాటును పోల్చిన ఆ ఎంపీని 'పెద్ద వెధవ'గా అభివర్ణిస్తూ, అప్పుడు సభలో ఉన్న కిషన్ రెడ్డి, బండి సంజయ్ సహా 16 మంది ఎంపీలు మౌనంగా ఉండటం రాష్ట్రానికే సిగ్గుచేటని మండిపడ్డారు. తెలంగాణ పౌరుషం లేని వారు ఎంపీలుగా ఉంటే రాష్ట్ర ఆత్మగౌరవం ఢిల్లీ వీధుల్లో తాకట్టు పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అదే గనుక బీఆర్ఎస్ ఎంపీలు సభలో ఉండి ఉంటే రణరంగం సృష్టించి, ఆ ఎంపీతో క్షమాపణ చెప్పించేవారమని ధీమా వ్యక్తం చేశారు. గతంలో హైదరాబాద్‌తో కూడిన తెలంగాణ కోసం తాను అనుభవించిన మానసిక క్షోభను, కొట్లాడి సాధించిన విజయాలను ఈ సందర్భంగా కేసీఆర్ గుర్తు చేసుకున్నారు.




## బెంగాల్ ప్రచారానికి తెర

రెండో విడతలో టీఎంసీ కంచుకోటలు

మమతతో బీజేపీ హోరాహోరీ



**మహా :** పశ్చిమ బెంగాల్‌లో అసెంబ్లీ ఎన్నికల ప్రచారానికి తెరపడింది. మైకులు మూగబోయాయి. చివరి వరకు ప్రధాన పార్టీలు ప్రచార సభలతో హోరెత్తించాయి. ఎన్నికల హామీలతో ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేశాయి. ఈనెల 29న రెండో విడతలో భాగంగా 142 స్థానాలకు పోలింగ్ జరగనుంది. మొత్తం 1448 మంది అభ్యర్థులు పోటీ చేస్తుండగా 3కోట్ల 21లక్షల 73వేల మంది ఓటర్లు వారి భవితవ్యాన్ని తేల్చనున్నారు. ఇందులో 1,64,35,627 మంది పురుషులు, 1,57,37,418 మంది మహిళలు, 792 మంది ట్రాన్స్‌జెండర్లు ఉన్నారు. ఇందుకోసం కేంద్ర ఎన్నికల సంఘం 41వేల పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసింది.

మిగతా 2లో

## డిప్యూటీ సీఎం సీపీఆర్వో మధుసూధన్ హఠాన్మరణం

**హైదరాబాద్, మహా :** డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వద్ద సీపీఆర్వో గా పనిచేస్తున్న సీనియర్ జర్నలిస్ట్ మారబోయిన మధుసూదన్ తీవ్రమైన గుండెపోటుతో అపోలో స్పెక్ట్రా ఆసుపత్రిలో మృతి చెందారు. నల్లగొండ జిల్లాకు చెందిన మధుసూదన్ గతంలో ఈనాడు, ఆంధ్రజ్యోతి వంటి సంస్థల్లో పని చేశారు. విధి నిర్వహణలో నికార్సైన పాత్రికేయుడిగా మన్ననలు పొందారు. ఆయనకు భార్య, కుమారుడు ఉన్నారు. సోమవారం మధ్యాహ్నం ఛాతి నొప్పితో స్థానిక ప్రైవేట్ ఆసుపత్రిలో చేరారు. ఈ సమయంలో గుండెపోటు రావడంతో అపోలో ఆసుపత్రికి తరలించారు. అక్కడే చికిత్స చేస్తున్న క్రమంలోనే.. మరో సారి గుండె పోటు రావడంతో మరణించినట్లు వైద్యులు తెలిపారు. వరుసగా మూడు సార్లు స్ట్రోక్ వచ్చినట్లు ప్రకటించారు.

### సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం తీవ్ర దిగ్భ్రాంతి..

మధుసూదన్ ఆకస్మిక మృతి పట్ల సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అత్యంత నిజాయతీ గల పాత్రికేయుడిని కోల్పోవడం బాధాకరంగా ఉందన్నారు. ఈ కష్ట సమయంలో ఆ కుటుంబానికి ఆత్మస్థైర్యం కలగాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు చెప్పారు. మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, సీతక్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి తదితరులు సంతాపం తెలిపారు.



## తెలంగాణ జైళ్ల శాఖలో సంస్కరణలు

- ఖైదీల పునరావాసమే లక్ష్యం
- జైళ్ల శాఖ డీజీ డాక్టర్ సౌమ్య మిశ్రా

వివరాలు 2లో



## భారత్ ఫ్యూచర్ సిటీకి హైస్పీడ్ జోష్

రైల్వే కారిడార్ల హబ్‌గా హైదరాబాద్

ముంబై, బెంగళూరు, చెన్నై నగరాలతో బుల్లెట్ వేగంతో అనుసంధానం

జూన్ 2న సనత్‌నగర్ టిమ్స్ ప్రారంభం

మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి



**హైదరాబాద్, మహా:** హైదరాబాద్ నగరాన్ని అంతర్జాతీయ స్థాయి రవాణా వ్యవస్థలతో అనుసంధానించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం భారీ ప్రణాళికను సిద్ధం చేస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా 'భారత్ ఫ్యూచర్ సిటీ'ని హైస్పీడ్ రైల్ కారిడార్ల హబ్ గా తీర్చిదిద్దేందుకు కార్యాచరణ మొదలైంది. సోమవారం సచివాలయంలో రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి హైస్పీడ్ రైల్వే

మిగతా 2లో

# బెంగాల్ ప్రచారానికి తెర

(మొదటిపేజీ తరువాయి)

అన్ని కేంద్రాల్లోనూ వెబ్‌క్యాస్టింగ్ సౌకర్యాన్ని కల్పించింది.

**4 జిల్లాలు - 91 సీట్లు**

జిల్లాల వారీగా చూస్తే, నార్త్ 24 పరగణాలలో 33, సౌత్ 24 పరగణాలలో 31, హావ్‌డాలో 16, కోల్‌కతాలో 11 అసెంబ్లీ సీట్లు ఉన్నాయి. నార్త్ 24, సౌత్ 24 పరగణాల జిల్లాల్లోనే అత్యధికంగా 64 సీట్లు ఉన్నాయి. ఈ ఎన్నికల్లో వీటిలో వీలైనన్ని ఎక్కువ సీట్లను గెల్చుకునేందుకు తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ), బీజేపీ సర్వశక్తులు ఒడ్డుతున్నాయి. ఇందుకోసం క్షేత్రస్థాయిలో సామాజిక, రాజకీయపరమైన వ్యూహాలను అమలు చేస్తున్నాయి. వాస్తవానికి ఈ నాలుగు జిల్లాలు టీఎంసీకి కంచుకోట లాంటివి. ఎలాగైనా ఈ జిల్లాల్లో పాగావేసి అధికారంలోకి రావాలనే పట్టుదలతో కమలదళం ఉంది.

**2 జిల్లాలకే బీజేపీ పరిమితం .. టీఎంసీదే హవా**

2021 అసెంబ్లీ ఎన్నికల్లో ప్రెసిడెన్సీ డివిజన్‌లోని 111 స్థానాలకుగానూ 96 సీట్లను టీఎంసీ గెల్చుకుంది. బీజేపీ 14 సీట్లకు, ఇండియన్ సెక్యులర్ ఫ్రంట్ పార్టీ 1 సీటుకు పరిమితం అయ్యాయి. బీజేపీ గెలుపు కేవలం నాదియా, ఉత్తర 24 పరగణాల జిల్లాలకే పరిమితమైంది. మిగతా 3 జిల్లాల్లో టీఎంసీ హవాయే కనిపించింది. ప్రెసిడెన్సీ డివిజన్‌లో పైచేయి సాధించే పార్టీకే అధికారం లభిస్తుందని ఆనాటి ఫలితాలతో రుజువైంది. ఇక 2024 లోక్‌సభ ఎన్నికలలో బీజేపీ కొంతమేర తన పట్టును పెంచుకుంది. ప్రెసిడెన్సీ డివిజన్ పరిధిలోని మొత్తం 21 అసెంబ్లీ సీట్లలో కమలదళం ఓటు బ్యాంకును పెంచుకోగలిగింది. ఇక టీఎంసీ 90 అసెంబ్లీ నియోజకవర్గాలలో ఆధిక్యాన్ని చాటుకుంది. కానీ భౌగోళిక స్వరూపంలో పెద్దగా మార్పు రాలేదు. లోక్‌సభ పోల్స్‌లోనూ బీజేపీ నాదియా, ఉత్తర 24 పరగణాల జిల్లాల్లో మాత్రమే పురోగతిని సాధించగలిగింది. నాదియా జిల్లాలోని 11 అసెంబ్లీ నియోజకవర్గాలలో, ఉత్తర 24 పరగణాల జిల్లాలోని 8 అసెంబ్లీ స్థానాల్లో బీజేపీ ఆధిక్యాన్ని పొందింది. టీఎంసీకి కంచుకోటలుగా ఉన్న సౌత్ 24 పరగణాలు, కోల్‌కతా, హౌరా జిల్లాల్లో మాత్రం బోణీ కొట్టలేకపోయింది. మొత్తంగా ఈ ఎన్నిక మమత వర్సెస్ బీజేపీ మధ్య హోరాహోరీగా సాగుతోంది. తొలి విడతలో హోరాహోరీ ఉన్నా రెండోవిడతలో మమతకు భారీ ఎడ్జ్ లభిస్తుందని టీఎంసీ వర్గాలు అంటున్నాయి.

# తెలంగాణ జైళ్ల శాఖలో సంస్కరణలు

**ఖైదీల పునరావాసమే లక్ష్యం.. జైళ్ల శాఖ డీజీ డాక్టర్ సౌమ్య మిశ్రా**

**మహా వరంగల్ బ్యూరో ;** తెలంగాణ జైళ్ల శాఖలో సంస్కరణలు అమలు చేసి ఖైదీల సంక్షేమం, పునరావాసానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని జైళ్ల శాఖ డైరెక్టర్ జనరల్ డాక్టర్ సౌమ్య మిశ్రా స్పష్టం చేశారు. సోమవారం వరంగల్ జిల్లాలో విస్తృతంగా పర్యటించిన ఆమె, పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించడంతో పాటు జైళ్లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. నర్సంపేట మండలం ఖానాపూర్ లో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 32వ మై నేషన్ ఫిల్లింగ్ స్టేషన్ ను డీజీ సౌమ్య మిశ్రా రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శిక్షా కాలం పూర్తి చేసుకుని విడుదలైన ఖైదీలకు గౌరవప్రదమైన ఉపాధిని కల్పించి, వారు సమాజంలో తిరిగి స్థిరపడేలా చేయడమే ఈ పెట్రోల్ బంక్ల ముఖ్య ఉద్దేశమని ఇవి కేవలం వ్యాపార కేంద్రాలు మాత్రమే కావని, మాజీ ఖైదీలకు సమాజంపై విశ్వాసం కల్పించి, గౌరవంగా బ్రతకడానికి ఇచ్చే రెండో అవకాశమని ఆమె పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టులో భాగస్వాములైన ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ అధికారులను ఆమె అభినందించారు. అనంతరం నర్సంపేటలోని మహిళా ప్రత్యేక జైలును డీజీ సందర్శించారు. జైలులోని బ్యారక్లు, భద్రతా ఏర్పాట్లు, పరిశుభ్రత, వైద్య సేవలు, ఖైదీలకు అందుతున్న ఆహార నాణ్యతను ఆమె నిశితంగా పరిశీలించారు. మహిళా ఖైదీలతో ప్రత్యక్షంగా మాట్లాడి, వారి ఆరోగ్య స్థితిగతులు, సమస్యలు, సంక్షేమ పథకాల అమలుపై వివరాలు తెలుసుకున్నారు. జైల్లో కల్పిస్తున్న నైపుణ్యాభివృద్ధి, పునరావాస కార్యక్రమాలలో చురుకుగా పాల్గొని, బయటకు వెళ్ళాక మంచి జీవితాన్ని గడపాలని వారికి సూచించడం జరిగింది.



# జిల్లాలో ఘనంగా బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**పార్టీ జెండాను ఆవిష్కరించిన మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్**

**మహా వరంగల్ బ్యూరో;** వరంగల్ జిల్లా బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో భారత రాష్ట్ర సమితి (బి.ఆర్.ఎస్) 26 వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా నరేందర్ పార్టీ శ్రేణులతో కలిసి తెలంగాణ జాతిపిత ప్రొఫెసర్ జయశంకర్ సార్ చిత్రపటానికి తెలంగాణ తల్లి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వరంగల్ జిల్లా బి.ఆర్.ఎస్ పార్టీ ఇంచార్జ్, వరంగల్ తూర్పు మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ పార్టీ జెండాను ఆవిష్కరించి వేడుకలను వైభవంగా నిర్వహించారు.ఈ సందర్భంగా నన్నపునేని నరేందర్ మాట్లాడుతూబి.ఆర్.ఎస్ అంటే కేవలం ఒక రాజకీయ పార్టీ కాదు, ఉద్యమ పార్టీ అని అది తెలంగాణ ప్రజల ఆత్మగౌరవ ప్రతీక అని తెలిపారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఒంటిచేత్తో ప్రారంభించిన మలిదశ ఉద్యమం కోట్లాది ప్రజల ఆశయాలను నెరవేర్చి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించిందని గుర్తు చేశారు. ఉద్యమ కాలం నుండి నేటి వరకు పార్టీ ప్రస్థానం అప్రతిహతంగా కొనసాగుతోంది అని పేర్కొన్నారు.అదేవిధంగా కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. సంక్షేమం, అభివృద్ధిని సమానంగా ముందుకు తీసుకెళ్లిన ఘనత కేసిఆర్ దేనని 2001 ఏప్రిల్ 27న కొద్ది మందితో ప్రారంభమైన ఈ ప్రయాణం నేడు 26 వసంతాలు పూర్తి చేసుకోవడం గర్వకారణమని అన్నారు. ముఖ్యంగా ఎన్నో అడ్డంకులు, అవమానాలు ఎదురైనా వెనకడుగు వేయకుండా పోరాడి సాధించుకున్న తెలంగాణను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరి పై ఉందని అన్నారు. తెలంగాణ రాష్ట్రానికి కేసీఆర్ నాయకత్వమే శ్రీరామ రక్ష అని రాబోయే రోజుల్లో ప్రజలు కోరుకున్నట్లు బి.ఆర్.ఎస్ పార్టీ మరలా అధికారం లోకి వచ్చి తెలంగాణను మరింత అభివృద్ధి చేసే దిశగా నడిపిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వరంగల్ తూర్పు నియోజకవర్గానికి చెందిన కార్పొరేటర్లు , మాజీ కార్పొరేటర్లు, తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారులు, యువజన నాయకులు, మహిళా నాయకులు మరియు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# తెలంగాణ జైళ్ల శాఖలో సంస్కరణలు

- ఖైదీల పునరావాసమే లక్ష్యం
- జైళ్ల శాఖ డీజీ డాక్టర్ సౌమ్య మిశ్రా



**మహా వరంగల్ బ్యూరో ;** తెలంగాణ జైళ్ల శాఖలో సంస్కరణలు అమలు చేసి ఖైదీల సంక్షేమం, పునరావాసానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని జైళ్ల శాఖ డైరెక్టర్ జనరల్ డాక్టర్ సౌమ్య మిశ్రా స్పష్టం చేశారు. సోమవారం వరంగల్ జిల్లాలో విస్తృతంగా పర్యటించిన ఆమె, పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించడంతో పాటు జైళ్లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. నర్సంపేట మండలం ఖానాపూర్ లో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 32వ మై నేషన్ ఫిల్లింగ్ స్టేషన్ ను డీజీ సౌమ్య మిశ్రా రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శిక్షా కాలం పూర్తి చేసుకుని విడుదలైన ఖైదీలకు గౌరవప్రదమైన ఉపాధిని కల్పించి, వారు సమాజంలో తిరిగి స్థిరపడేలా చేయడమే ఈ పెట్రోల్ బంక్ల ముఖ్య ఉద్దేశమని ఇవి కేవలం వ్యాపార కేంద్రాలు మాత్రమే కావని, మాజీ ఖైదీలకు సమాజంపై విశ్వాసం కల్పించి, గౌరవంగా బ్రతకడానికి ఇచ్చే రెండో అవకాశమని ఆమె పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టులో భాగస్వాములైన ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ అధికారులను ఆమె అభినందించారు. అనంతరం నర్సంపేటలోని మహిళా ప్రత్యేక జైలును డీజీ సందర్శించారు. జైలులోని బ్యారక్లు, భద్రతా ఏర్పాట్లు, పరిశుభ్రత, వైద్య సేవలు, ఖైదీలకు అందుతున్న ఆహార నాణ్యతను ఆమె నిశితంగా పరిశీలించారు. మహిళా ఖైదీలతో ప్రత్యక్షంగా మాట్లాడి, వారి ఆరోగ్య స్థితిగతులు, సమస్యలు, సంక్షేమ పథకాల అమలుపై వివరాలు తెలుసుకున్నారు. జైల్లో కల్పిస్తున్న నైపుణ్యాభివృద్ధి, పునరావాస కార్యక్రమాలలో చురుకుగా పాల్గొని, బయటకు వెళ్ళాక మంచి జీవితాన్ని గడపాలని వారికి సూచించడం జరిగింది.

# పోలీసులకు 'బర్త్ డే' గిఫ్ట్

- పుట్టినరోజు, పెళ్లి రోజున స్పెషల్ లీవ్
- సిబ్బందికి డీజీపీ శివధర్ రెడ్డి కానుక
- రాష్ట్రవ్యాప్తంగా హర్షా తిరేకాలు
- 30న పదవీ విరమణ చేయనున్న డీజీపీ




**హైదరాబాద్, మహా:** నిరంతరం విధి నిర్వహణలో నిమగ్నమై, శాంతిభద్రతల పరిరక్షణ కోసం అహర్నిశలు శ్రమించే తెలంగాణ పోలీసులకు రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) బి. శివధర్ రెడ్డి తీపి కబురు అందించారు. పోలీసు సిబ్బంది సంక్షేమానికి పెద్దపీట వేస్తూ, వారి మానసిక ఉల్లాసాన్ని పెంపొందించే దిశగా ఒక చారిత్రక నిర్ణయం తీసుకున్నారు. ఇకపై రాష్ట్రంలోని ప్రతి పోలీస్ ఉద్యోగికి వారి పుట్టినరోజు, వివాహ వార్షికోత్సవం రోజున 'ప్రత్యేక సెలవు' మంజూరు చేస్తూ సోమవారం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేశారు. హోదాతో సంబంధం లేకుండా కానిస్టేబుల్ నుంచి ఉన్నతాధికారుల వరకు అందరికీ ఈ సౌకర్యం వర్తించనుంది.శాంతిభద్రతల పరిరక్షణ, వీఐపీల బందోబస్తు, నేర నియంత్రణ వంటి విధుల్లో పోలీసులు తీవ్రమైన ఒత్తిడికి గురవుతుంటారని, ఈ క్రమంలో వారు తమ కుటుంబ సభ్యులతో సమయం గడపలేకపోతున్నారన్న వాస్తవాన్ని డీజీపీ ఈ సందర్భంగా నొక్కి చెప్పారు. జీవితంలో అత్యంత ముఖ్యమైన రోజులను కుటుంబంతో కలిసి ఆనందంగా గడుపుతారని, దీనివల్ల వారిలో పని పట్ల ఉత్సాహం పెరగడంతో పాటు మానసిక ప్రశాంతత లభిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ మేరకు అన్ని యూనిట్ అధికారులకు (ఎస్పీలు, కమిషనర్లు) స్పష్టమైన ఆదేశాలు అందాయి. అత్యవసర పరిస్థితులు మినహా, సిబ్బంది ఈ ప్రత్యేక సందర్భాల కోసం దరఖాస్తు చేసుకున్నప్పుడు ఎలాంటి ఆటంకాలు లేకుండా సెలవు మంజూరు చేయాలని డీజీపీ స్పష్టం చేశారు.ఈ నిర్ణయం వెనుక ఒక ఆసక్తికరమైన నేపథ్యం కూడా ఉంది. డీజీపీ శివధర్ రెడ్డి ఈ నెల 30న (ఏప్రిల్ 30, 2026) పదవీ విరమణ చేయనున్నారు. తన పదవీకాలం ముగిసేలోగా క్షేత్రస్థాయిలో పనిచేసే సిబ్బందికి ఏదైనా శాశ్వత ప్రయోజనం చేకూర్చాలనే ఉద్దేశంతోనే ఈ 'వార్షిక కానుక'ను ప్రకటించినట్లు పోలీస్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఇప్పటికే పక్క రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌తో పాటు కర్ణాటకలో ఇలాంటి విధానం అమల్లో ఉండగా, ఇప్పుడు తెలంగాణలో కూడా దీనికి శ్రీకారం చుట్టడంపై పోలీసు సంఘాల నేతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నిరంతరం డ్యూటీల ఒత్తిడిలో ఉండే మాకు ఇది నిజంగా ఒక గొప్ప ఊరట అని సిబ్బంది అభిప్రాయపడుతున్నారు.జనవరిలో బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి డీజీపీ శివధర్ రెడ్డి సాంకేతికత వినియోగం మరియు పోలీసు సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించారు. ఇటీవల ఖమ్మం జిల్లాలో పోలీస్ వెల్ఫేర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ మరియు స్టాఫ్ క్వార్టర్స్‌ను ప్రారంభించిన ఆయన, ఇప్పుడు ఈ సెలవుల నిర్ణయం ద్వారా సిబ్బంది హృదయాల్లో చెరగని ముద్ర వేశారు. పుట్టినరోజు లేదా వివాహ వార్షికోత్సవం కంటే ముందుగానే సిబ్బంది తమ యూనిట్ అధికారులకు లిఖితపూర్వక అభ్యర్థన సమర్పించాల్సి ఉంటుందని, సర్వీస్ రిజిస్టర్‌లోని వివరాల ఆధారంగా ఈ సెలవును కేటాయిస్తారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.




# యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

**ఇన్స్పెక్టర్ పుల్యాల కిషన్**

**మహా వరంగల్ బ్యూరో;** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో ఈనెల 27 నుండి 2 05 2026 వరకు వారం రోజుల పాటు పిల్లలు విద్యార్థులు యువత భవిష్యత్ ను దృష్టిలో ఉంచుకొని పిల్లల భద్రత.... సె నో టు డ్రగ్స్ అనే కార్యక్రమాల ద్వారా వారికి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని అవగాహన కల్పిస్తున్నారు. ఈ సందర్భంగా మడికొండ ఇన్స్పెక్టర్ పుల్యాల కిషన్ మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం లో భాగంగా చైల్డ్ సేఫ్టీ .. సే నో టూ డ్రగ్స్ ద్వారా పిల్లలను వారి ఆరోగ్యం కాపాడడం కోసం ప్రవేశ పెట్టిన గొప్ప కార్యక్రమమని దానిని మరింత ముందుకు తీసుకెళ్లడం కోసం పోలీస్ శాఖ తెలంగాణ డిజిపి శివధర్ రెడ్డి ఆదేశాల మేరకు వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ఆధ్వర్యంలో, సెంట్రల్ జోన్ డీసీపీ దార కవిత ఆదేశాలతో కాజిపేట్ ఏసీపి పింగళి ప్రశాంత్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని ఇన్స్పెక్టర్ తెలిపారు. అంతేకాకుండా మత్తు పదార్థాలను తీసుకోవడం వల్ల నష్టాలు మాత్రమే ఉంటాయని ఎటువంటి లాభాలు ఉండవని తెలిపారు. అందువల్ల యువత ఎటువంటి మత్తు పదార్థాల జోలికి పోకూడదని సూచించారు. చైల్డ్ సేఫ్టీ కార్యక్రమంలో భాగంగా 18 సంవత్సరాల లోపు పిల్లలను ఎటువంటి శారీరకంగా శ్రమకు గురి కాకూడదని ముఖ్యంగా ప్రమాదకరమైన పరిశ్రమలలో పని చేయించడం వంటివి చేయకూడదని అలాగే పిల్లలు పనిలో కాదు బడిలో ఉండి భవిష్యత్తులో పిల్లలు గౌరవ ప్రదంగా జీవించే హక్కును కల్పించాలని కోరారు.

# బెంగాల్ ఎన్నికల బరిలో యూపీ ఎన్‌కౌంటర్ స్పెషలిస్ట్

- రెండో విడత పోలింగ్‌కు ఈసీ కీలక నియామకం
- స్వేచ్ఛగా, సజావుగా రెండో విడత పోలింగ్
- ఎన్నికల పరిశీలకుడిగా ఐపీఎస్ అజయ్ పాల్ శర్మ
- కోల్‌కతాలో కేంద్ర బలగాల పహారా
- పటిష్ఠ భద్రత మధ్య బెంగాల్ కురుక్షేత్రం



**కోల్‌కతా,మహా:** పశ్చిమ బెంగాల్‌లో రెండో విడత పోలింగ్‌ను అత్యంత స్వేచ్ఛాయుత వాతావరణంలో, సజావుగా నిర్వహించేందుకు కేంద్ర ఎన్నికల కమిషన్ కీలక నిర్ణయం తీసుకుంది. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా, ఉత్తరప్రదేశ్ క్యాడర్‌కు చెందిన 'ఎన్‌కౌంటర్ స్పెషలిస్ట్'గా పేరుగాంచిన ఐపీఎస్ అధికారి అజయ్ పాల్ శర్మను ఎన్నికల పరిశీలకుడిగా నియమించింది. కోల్‌కతాతో సహా దక్షిణ బెంగాల్‌లోని మొత్తం 142 నియోజకవర్గాల్లో ఈనెల 29న రెండో విడత పోలింగ్ జరగనుంది. ఈ క్రమంలో అత్యంత సమర్థుడైన అధికారిగా పోలీసు శాఖలో గుర్తింపు పొందిన అజయ్ పాల్ శర్మ సేవలను ఈసీ వినియోగించుకుంటోంది. పంజాబ్‌లోని లూధియానాకు చెందిన ఆయన, 2011 బ్యాచ్‌కు చెందిన అధికారిగా ఉత్తరప్రదేశ్‌లో అనేక సాహసోపేతమైన ఆపరేషన్లలో పాల్గొని తనదైన ముద్ర వేశారు. రెండో విడత పోలింగ్ జరిగే ప్రాంతాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఎన్నికల కమిషన్ మునుపెన్నడూ లేని విధంగా భారీ భద్రతా ఏర్పాట్లు చేసింది. ఏడు జిల్లాల పరిధిలో మొత్తం 2,321 కంపెనీల కేంద్ర బలగాలను మోహరించింది. కేవలం కోల్‌కతా నగరంలోనే అత్యధికంగా 273 కంపెనీల బలగాలను రంగంలోకి దించడం ఈ విడత ప్రాధాన్యతను చాటిచెబుతోంది. క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ కోసం 142 మంది సాధారణ పరిశీలకులు, 95 మంది పోలీసు పరిశీలకులతో పాటు 100 మంది వ్యయ పరిశీలకులను ఈసీ కేటాయించింది. ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించేందుకు (రియల్ టైమ్ మానిటరింగ్) కెమెరాలతో కూడిన డ్రోన్‌లను సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. ఈ రెండో విడతలో సుమారు 3 కోట్ల 64 లక్షల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఓటర్ల సౌకర్యార్థం రాష్ట్రవ్యాప్తంగా 41 వేల పోలింగ్ స్టేషన్లను అధికారులు సిద్ధం చేశారు. సమస్యాత్మక ప్రాంతాల్లో కేంద్ర బలగాల పహారాను పెంచడంతో పాటు, ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద కట్టుదిట్టమైన భద్రత ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. అజయ్ పాల్ శర్మ వంటి కఠినమైన అధికారుల నియామకం ద్వారా హింసాత్మక ఘటనలకు తావు లేకుండా ఎన్నికలు ముగించాలని ఎన్నికల కమిషన్ భావిస్తోంది. ఎన్నికల నిర్వహణలో పారదర్శకతను పాటిస్తూ, ఓటర్లు నిర్భయంగా వచ్చి తమ తీర్పును వెల్లడించేలా యంత్రాంగం అన్ని చర్యలు చేపట్టింది.

# వైద్య రంగంలో తెలంగాణ దేశానికే దిక్సూచి



(మొదటిపేజీ తరువాయి)

మెడికల్ టూరిజం మరింత వృద్ధి చెందాలన్న ఉద్దేశంతో పశ్చిమాసియా దేశాలతో నేరుగా విమాన సర్వీసులు నడపాలని ఇప్పటికే ప్రధానమంత్రిని, పౌర విమానయాన శాఖ మంత్రిని కోరినట్లు ఆయన తెలిపారు. దేశంలోనే అత్యుత్తమ వైద్య సౌకర్యాలు తెలంగాణ నుంచి అందాలన్న లక్ష్యంతో ఎక్కడా లోపాలు లేకుండా నిర్ణయాలు తీసుకుంటున్నామని, ఇక్కడ పెట్టుబడులు పెట్టే వారికి ప్రభుత్వం పూర్తి భద్రత కల్పిస్తుందని ఆయన హామీ ఇచ్చారు. 1967లో అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ హైదరాబాద్‌లో ఐడీపీఎల్ (IDPL) ఏర్పాటు చేయడంతోనే నగరం ఫార్మా హబ్‌గా అవతరించిందని, నేడు దేశం నుంచి ఎగుమతి అవుతున్న బల్క్ డ్రగ్స్‌లో 40 శాతం హైదరాబాద్ నుంచే వెళ్తున్నాయని ఆయన గుర్తుచేశారు.అపోలో హాస్పిటల్స్ ప్రస్థానాన్ని కొనియాడుతూ, 46 ఏళ్ల కిందట చెన్నైలో కేవలం 150 పడకలతో ప్రారంభమైన ఈ సంస్థ నేడు తన 76వ బ్రాంచ్‌ను ప్రారంభించుకోవడం అభినందనీయమన్నారు. 2028 డిసెంబర్ లోపు అపోలో తన 100వ బ్రాంచ్‌ను ఏర్పాటు చేయాలని, ఆ ప్రారంభోత్సవానికి కూడా తనను ఆహ్వానించాలని కోరుకుంటున్నట్లు ముఖ్యమంత్రి తన అభిలాషను వ్యక్తం చేశారు. అపోలో హాస్పిటల్స్ దేశానికే ఒక రోల్ మాడల్‌గా నిలిచిందని, అంతర్జాతీయ స్థాయిలో ఒక గొప్ప బ్రాండ్‌గా ఎదిగి సహాయం ఆశిస్తున్న కోట్లాది మంది ప్రజల మనసుల్లో నిలిచిందని ఆయన ప్రశంసించారు.ముఖ్యంగా డాక్టర్ ప్రతాప్ సి రెడ్డి మహిళా సాధికారతను తన చేతల్లో చూపించారని, ఆయన తన నలుగురు కుమార్తెలను అపోలోకు నాలుగు స్తంభాలుగా, విజయవంతమైన మహిళా పారిశ్రామికవేత్తలుగా మరియు బాధ్యత గల పౌరులుగా తీర్చిదిద్దారని ముఖ్యమంత్రి కొనియాడారు. ఈ కార్యక్రమంలో అపోలో ప్రతినిధులు డాక్టర్ సంగీతా రెడ్డి, శోభనా కామినేని, ఉపాసన కొణిదెలతో పాటు పలువురు వైద్యులు, యాజమాన్య ప్రతినిధులు పాల్గొన్నారు.

# భారత్ ఫ్యూచర్ సిటీకి హైస్పీడ్ జోష్

(మొదటిపేజీ తరువాయి)

ప్రాజెక్టుల పురోగతిపై ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. భవిష్యత్ రవాణా అవసరాలను దృష్టిలో ఉంచుకుని హైదరాబాద్ నుండి ముంబై, చెన్నై, బెంగళూరు నగరాలను బుల్లెట్ రైలు వేగంతో అనుసంధానించడంపై ఈ సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. హైదరాబాద్ పూణే ముంబై మధ్య ప్రతిపాదించిన హైస్పీడ్ రైల్వే కారిడార్ కు సంబంధించి ఇప్పటికే డిటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ (DPR) పూర్తయింది. మొత్తం 761 కిలోమీటర్ల మేర సాగే ఈ మార్గంలో 12 స్టేషన్లు ఉండగా, అందులో 10 ఎలివేటెడ్ మరియు 2 అండర్ గ్రౌండ్ స్టేషన్లుగా నిర్మించనున్నారు. ఈ రైలు గంటకు 330 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తూ, నాన్ స్టాప్ గా వెళ్తే కేవలం 2 గంటల 55 నిమిషాల్లోనే ముంబై చేరుకునేలా ప్లాన్ చేశారు. వికారాబాద్ సమీపంలో సుమారు 4.6 కిలోమీటర్ల మేర నిర్మించనున్న టన్నెల్ అంశంపై ముఖ్యమంత్రితో చర్చించి వేగంగా నిర్ణయం తీసుకుంటామని మంత్రి వెల్లడించారు.మరోవైపు భారత్ ఫ్యూచర్ సిటీ నుండి అమరావతి మీదుగా చెన్నైకి, అలాగే బెంగళూరుకు హైస్పీడ్ కనెక్టివిటీ కల్పించేందుకు సర్వేలు జరుగుతున్నాయి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా ఈ ప్రాజెక్టుల పట్ల సానుకూలంగా ఉందని, రెండు రాష్ట్రాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని మంత్రి ఆదేశించారు. ఈ హైస్పీడ్ కారిడార్లు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను 3 ట్రిలియన్ డాలర్ల స్థాయికి తీసుకెళ్లడంలో కీలక పాత్ర పోషిస్తాయని ఆయన అభివర్ణించారు. రవాణా రంగంతో పాటు ప్రజారోగ్యానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోంది. రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా జూన్ 2న సనత్‌నగర్ టిమ్స్ ఆసుపత్రిని ప్రారంభించేందుకు పనులను వేగవంతం చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. పేద ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందించేలా వరంగల్ ఆసుపత్రి పనుల పురోగతిపై కూడా ఆయన ఆరా తీశారు. ఈ సమీక్షలో ఆర్ అండ్ బి స్పెషల్ సీఎస్ వికాస్ రాజ్ తో పాటు పలువురు రైల్వే మరియు ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# మట్టెవాడ కానిస్టేబుల్ పై సస్పెన్షన్ వేటు

**మహా వరంగల్ బ్యూరో;** వరంగల్ మట్టెవాడ పోలీస్ స్టేషన్ లో కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తున్న సుమన్ పై సస్పెన్షన్ వేటు పడింది. విశ్వసనీయ సమాచారం ప్రకారం మొబైల్ ఫోన్ చోరీ కేసులో ఫిర్యాదు చేయడానికి వచ్చిన బాధితుల దగ్గర కానిస్టేబుల్ సుమన్ డబ్బులు డిమాండ్ చేశారని ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ఆదేశాల మేరకు జరిగిన శాఖపరమైన విచారణలో ఆరోపణలు నిజమని తేలడంతో సస్పెండ్ చేసినట్లు సమాచారం.

# ఆంధ్రా యూనివర్శిటీకి రూ.500 కోట్లు

**చంద్రబాబు**

**విశాఖ, మహా:** విశాఖలోని ఆంధ్ర యూనివర్సిటీ శతాబ్ది వేడుకల్లో పాల్గొన్న సీఎం చంద్రబాబు వర్సిటీ అభివృద్ధికి రూ.500 కోట్లు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. ఏయూకి ప్రపంచ వ్యాప్తంగా గొప్ప గుర్తింపు ఉందని.. ఎందరో మేధావులు, శాస్త్రవేత్తలు ఇక్కడి నుంచే వచ్చారని వివరించారు. నోబెల్ బహుమతి గెల్చుకున్న సర్ సీవీ.రామన్ సైతం ఇక్కడే చదువుకున్నారని గుర్తు చేశారు. ఆంధ్ర యూనివర్సిటీలో చదివి దేశ విదేశాల్లో ఉన్నత స్థానాల్లో ఉన్న వారు, ప్రస్తుతం పనిచేస్తున్న ప్రొఫెసర్లు కలిసి మరో రూ.500 కోట్లు ఇవ్వాలని పిలుపునిచ్చారు. అంతా కలిసి ముందుకొస్తే.. ఈ నిధి సమకూరడం పెద్ద విషయం కాదన్నారు. రూ.1000 కోట్లతో అభివృద్ధి చేస్తే, యూనివర్సిటీ ప్రపంచ స్థాయికి వెళ్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఏయూనే నా రాజకీయ పునాది

**వెంకయ్యనాయుడు**

**విశాఖ, మహా:** ఆంధ్ర విశ్వవిద్యాలయం శతాబ్ది వేడుకల్లో పాల్గొన్న మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు తన రాజకీయ ప్రస్థానానికి ఈ వర్సిటీయే పునాది అని భావోద్వేగంతో గుర్తుచేసుకున్నారు. విశ్వవిద్యాలయాలు కేవలం డిగ్రీలు, థీసిస్‌లు ఇచ్చే కేంద్రాలుగా మాత్రమే మిగిలిపోకూడదని, అవి పరిశోధనలకు నిలయాలుగా మారాలని ఆయన ఆకాంక్షించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థుల్లో సరికొత్త నైపుణ్యాలను పెంపొందించాల్సిన బాధ్యత విద్యాసంస్థలపై ఉందని వెంకయ్యనాయుడు సూచించారు.

# ఇరాన్ ప్రయోజనాలే మాకు ముఖ్యం

**సెయింట్ పీటర్స్‌బర్గ్, మహా:** పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు కమ్ముకుంటున్న ప్రస్తుత క్లిష్ట పరిస్థితుల్లో ఇరాన్‌కు రష్యా పూర్తిస్థాయిలో అండగా నిలుస్తామని భరోసా ఇచ్చింది. ఇరాన్ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకునే తాము భవిష్యత్తులో అడుగులు వేస్తామని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ స్పష్టం చేశారు. సోమవారం సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీతో జరిగిన కీలక భేటీలో పుతిన్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఇరు దేశాల మధ్య వ్యూహాత్మక సంబంధాలను మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని ఆయన మాటిచ్చారు. గత వారం ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ తనకు పంపిన ప్రత్యేక సందేశాన్ని ప్రస్తావించిన పుతిన్.. ఇరాన్‌తో తమకు ఉన్న సాన్నిహిత్యాన్ని మరోసారి చాటిచెప్పారు. అంతర్జాతీయ వేదికలపై ఇరాన్ గొంతుకకు రష్యా బలం చేకూరుస్తుందని ఈ సమావేశం ద్వారా స్పష్టమైన సంకేతాలు అందాయి.మరోవైపు అగ్రరాజ్యం అమెరికాకు ఇరాన్ అత్యంత కఠినమైన హెచ్చరికలు జారీ చేసింది. తమ దేశంతో ఒప్పందం కుదుర్చుకోవాలంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలపై ఇరాన్ ఉపాధ్యక్షుడు ఇస్మాయిల్ సాహెబ్ ఇస్ఫహానీ తీవ్రంగా స్పందించారు. ఇరాన్‌లోని మౌలిక వసతులను టార్గెట్ చేసేందుకు అమెరికా ప్రయత్నిస్తే.. తాము ఊరుకోబోమని, అంతకు నాలుగురెట్ల తీవ్రతతో ప్రతీకారం తీర్చుకుంటామని ఆయన హెచ్చరించారు. తమ దేశ మౌలిక సదుపాయాలపై జరిగే ఎలాంటి దాడులైనా నేరుగా యుద్ధ చర్యలుగానే పరిగణిస్తామని, అందుకు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని ఇరాన్ స్పష్టం చేసింది. ఇరాన్‌ను బెదిరింపులతో లొంగదీసుకోవాలని చూడటం అమెరికాకు సాధ్యం కాదని ఆయన ఈ సందర్భంగా ఎద్దేవా చేశారు.పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు పరాకాష్టకు చేరిన తరుణంలో రష్యా అధ్యక్షుడు పుతిన్, ఇరాన్ విదేశాంగ మంత్రి అరాగ్చీ మధ్య జరిగిన ఈ భేటీకి అంతర్జాతీయ రాజకీయాల్లో అత్యంత ప్రాధాన్యం ఏర్పడింది.

## యువత మత్తు పదార్థాలకు, వ్యసనాలకు బానిసలు కావద్దు



మందమర్రి సీఐ పర్స రమేష్

**మందమర్రి, మహా :** చదువుకునే యువత మత్తు పదార్థాలకు, వ్యసనాలకు బానిసలు కావద్దని మందమర్రి సర్కిల్ ఇన్స్పెక్టర్ పర్స రమేష్ పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక ఐటిఐ కళాశాలలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక'లో భాగంగా స్థానిక కళాశాలలో "బాలల భద్రత మాదకద్రవ్యాల నిర్మూలన" అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ నేటి యువతే భారతదేశ భవిష్యత్తుకు పునాది అని అన్నారు. ఇలాంటివారు మాదకద్రవ్యాల బారిన పడి చెడు వ్యసనాలకు బానిసలై తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని విచారం వ్యక్తం చేశారు. డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలను వివరించడమే కాకుండా, చట్టపరమైన చర్యల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. బాలల భద్రత విషయంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, వేధింపులు, అసాంఘిక కార్యకలాపాలు నీ దృష్టికి వస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఆపద అత్యవసర సమయంలో డయల్ 100 కాని స్థానిక పోలీసుల సాయం తీసుకోవాలని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మందమర్రి ఎస్సై నరేష్, కాసిపేట ఎస్సై ఆంజనేయులు లతో పాటు కళాశాల అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఫీజు రియంబర్స్మెంట్ విడుదల చేయాలి



**మంచిర్యాల, మహా :** వివిధ కళాశాలలో విద్యను అభ్యసించిన విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు విడుదల చేయాలని బీ.ఆర్.ఎస్.వి. మంచిర్యాల జిల్లా అధ్యక్షులు బడికెల శ్రావణ్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సోమవారం మంచిర్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏవోకు ఆయన వినతి పత్రం అందజేశారు. గత రెండు సంవత్సరాల నుండి కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల భవితవ్యంతో ఆడుకుంటుందని విమర్శించారు. డిగ్రీ, ఇంజనీరింగ్, వైద్య, లా సెట్, విద్య పూర్తయిపోయిన యువకులకు ఒరిజినల్ ధ్రువపత్రాలు రాక వివిధ పరిశ్రమలలో తదితరులలో పనిచేయలేక పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రియంబర్స్మెంట్ విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్ర బీ.ఆర్.ఎస్.వి. పిలుపుమేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని శ్రావణ్ స్పష్టం చేశారు.

## ఎంబీబీఎస్ పట్టా అందుకున్న బీర్ల అయిలయ్య కూతురు బీర్ల అరుంధతి




**యాదాద్రి భువనగిరి, మహా:** ప్రముఖ విద్యాసంస్థ కామినేని ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ కాలేజీలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అనితల ప్రథమ పుత్రిక బీర్ల అరుంధతి సోమవారం ఎంబీబీఎస్ విద్యను విజయవంతంగా పూర్తి చేసుకొని పట్టా అందుకున్నారుఈ వేడుకలో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, అతిథులు పాల్గొని విద్యార్థుల కృషిని అభినందించారు.బీర్ల అరుంధతి తన విద్యాభ్యాసంలో చూపిన పట్టుదల, కృషి, అంకిత భావం ద్వారా ఎంబీబీఎస్ పట్టాను అందుకున్నారు.ఈ సందర్భంలో కుటుంబ సభ్యులు, స్నేహితులు హర్షం వ్యక్తం చేస్తూ అరుంధతిని అభినందించారు.వైద్య విద్య పూర్తి చేయడం ద్వారా సమాజానికి సేవ చేయాలనే లక్ష్యంతో ఆమె ముందుకు సాగుతానని...భవిష్యత్తులో ఒక మంచి వైద్యురాలిగా ప్రజలకు సేవలందించాలని ఆకాంక్షను ఆమె వ్యక్తం చేశారు.ఈ ఘన విజయంతో బీర్ల అరుంధతి తల్లీ తండ్రులు బీర్ల అయిలయ్య అనిత , కుటుంబ సభ్యులు, సన్నిహితులకు సంతోషంగా వ్యక్తం చేశారు.

### ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక
## గ్రామసభల ద్వారా ఎంపిక చేయాలి

- నూతన పెన్షన్లు వెంటనే మంజూరు చేయాలి
- తాహాసిల్దార్ కార్యాలయం ముట్టడి
- సిపిఎం మండల కమిటీ




**వలిగొండ, మహా :** ఇందిరమ్మ ఇండ్లు పార్టీ కార్యకర్తలతో కాకుండా గ్రామ సభల ద్వారా నిజమైన అర్హులైన టువంటి లబ్ధిదారులకు మంజూరు చేయాలని అలాగే నూతన పెన్షన్లు మంజూరు చేయాలని సోమవారం వలిగొండ తహసిల్దార్ కార్యాలయం ముట్టడించిన సిపిఎం కార్యకర్తలు పలు సమస్యలపై వలిగొండ తహసిల్దార్ దశరథ ఎంపీడీవో జలంధర్ రెడ్డిలకు వినతి పత్రం అందజేశారుఈకార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి సిర్పంగి స్వామి జిల్లా నాయకులు మాటూరు బాలు రాజు మద్దెల రాజయ్య ఈర్లపల్లి ముత్యాలు కందడి సత్తిరెడ్డి గాజుల ఆంజనేయులు కల్కూరి రామచందర్ శీర్కా శ్రీశైలం రెడ్డి దుబ్బ లింగం కవిడే సురేష్ కల్కూరి ముత్యాలు కర్ణ కంటి యాదయ్య బూడిద మన్నెమ్మ శీలం ఇందిరా కొండూరు సత్తయ్య దొడ్డి బిక్షపతి సిరిపంగి శ్రీరాములు పలుసం స్వామి మారబోయిన నరసింహ సల్ల ఐలయ్య దయ్యాల మల్లేశం రాధారపు మల్లేశం పలసం లింగం కందగట్ల సాయిరెడ్డి గుండెపురి నరసింహ కొమ్ము స్వామి చేకూరి నగేష్ నారి రామస్వామి ఉండాడి పాపయ్య ఏటెల్లినరసింహ రేపాక ముత్యాలు రాపోతు వెంకులు భూపతి రాములు బంధారపు ధనంజయ రుద్రపల్లి రామలింగం జక్క రాఘవరెడ్డి గంగాపురం వెంకటేశం మారబోయిన ముత్యాలు పెదబోయిన భీమరాజు వద్దేమాన్ రవి కాటేపల్లి వెంకటేశం మైసూర్ల నరేందర్ వీరమల్ల శ్రీకాంత్ పాలు శంకరాచారి రుద్రపల్లి లింగయ్య మంద సంజీవ గోలనుకొండ బాల నరసింహ తదితరులు పాల్గొన్నారు

## ఉద్యమకారులను గుర్తించకుంటే పతనమే..

జూన్ 2 డెడ్ లైన్.. సంగిశెట్టి క్రిస్టఫర్, టియుజెఎసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

**భువనగిరి, మహా:** రాష్ట్ర ప్రభుత్వం ఉద్యమకారుల అంశంనానుచుడు ధోరణి అవలంబిస్తూ కాలయాపన చేస్తుండడం పట్ల టి యు జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంగిశెట్టి క్రిస్టఫర్ మండిపడ్డారు ఆయన సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఉద్యమకారుల త్యాగాల వలనే కదా మీరు ఇవ్వాలా భోగాలు అనుభవిస్తున్నది ప్రభుత్వం నానుచుడు ధోరణి అవలంబించడం పట్ల ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు వెంటనే జార్ఖండ్ రాష్ట్రంలో అమలు చేస్తున్నట్లుగానే మన రాష్ట్రంలో అమలు చేసి గౌరవించాలని ఆయన డిమాండ్ చేశారు

# ఘనంగా బీఆర్ఎస్ ఆవిర్భావ వేడుకలు..

- కేసీఆర్ పాలనలోనే తెలంగాణకు స్వర్ణయుగం జిల్లా పార్టీ అధ్యక్షులు రమావత్ రవీంద్ర కుమార్..
- కాంగ్రెస్ వైఫల్యాలపై ప్రజలు రగిలిపోతున్నారు మాజీ ఎమ్మెల్యేలు..



**నల్లగొండ, మహా :** భారత రాష్ట్ర సమితి ఆవిర్భావ దినోత్సవ వేడుకలను జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. జిల్లా పార్టీ అధ్యక్షులు రమావత్ రవీంద్ర కుమార్ పార్టీ పతాకాన్ని ఆవిష్కరించి వేడుకలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీ చైర్మన్ బండ నరేందర్ రెడ్డి, నల్లగొండ మరియు నకిరేకల్ మాజీ శాసనసభ్యులు కంచర్ల భూపాల్ రెడ్డి, చిరుమర్తి లింగయ్య తదితరులు పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సమితి ఏర్పాటు నుంచి స్వరాష్ట్ర సాధన వరకు సాగిన పోరాటాన్ని గుర్తు చేసుకున్నారు. అమరుల ప్రాణత్యాగాల స్ఫూర్తితో ఉవ్వెత్తున ఎగసిన ప్రజా ఉద్యమాల తోడుగా అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర రావు తన ప్రాణాలను పణంగా పెట్టి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించారని కొనియాడారు. పదేళ్ల పరిపాలనలో తెలంగాణను దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా తీర్చిదిద్దిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని అన్ని వర్గాల ప్రజల ఆకాంక్షలను నెరవేర్చిన గొప్ప నేత ఆయనని ప్రశంసించారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై వారు స్పందిస్తూ అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని ఆర్థికంగా దివాలా తీయించిందని విమర్శించారు. ప్రభుత్వంపై ప్రజల్లో ఇప్పటికే తీవ్ర వ్యతిరేకత మొదలైందని, ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైన కాంగ్రెస్‌కు రాబోయే ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఈ వేడుకల్లో స్త్రీ శిశు సంక్షేమ శాఖ మాజీ ఆర్వో మాలె శరణ్య రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షులు రేగట్టే మల్లికార్జున రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ మందడి సైదిరెడ్డి, నగర పార్టీ అధ్యక్షులు భువనగిరి దేవేందర్, ఉద్యమ నేతలు సింగం రామ్మోహన్, అభిమన్యు శ్రీనివాస్, మైనం శ్రీనివాస్, కొండూరు సత్యనారాయణ, జమాల్ ఖాద్రి పాల్గొన్నారు. వీరితో పాటు కార్పొరేటర్లు మారగోని భవాని గణేష్, దొడ్డి రమేష్, పెరిక యాదయ్య, బాణావత్ దీప్లా, పేర్ల మల్లీశ్వరి అశోక్, రత్నగిరి తారకమ్మ శ్రీనివాస్, కుందూరు దీపికా ప్రవీణ్ రెడ్డి, గోపగోని స్వాతి రాజశేఖర్, బొమ్మరబోయిన నాగార్జున, రేగట్టే మహేందర్ తో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

## విద్యార్థులకు ఉన్నత శిఖరాలే లక్ష్యం కావాలి!

- శిశు సంరక్షణ సంస్థల విద్యార్థులకు జిల్లా కలెక్టర్ పిలుపు..
- సంక్షేమ వారోత్సవాల్లో భాగంగా గుర్తింపు పత్రాల పంపిణీ బాలల భద్రతకు అత్యధిక ప్రాధాన్యం..





**నల్గొండ టౌన్, మహా :** విద్యార్థులు క్రమశిక్షణతో చదివి జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ ఆకాంక్షించారు. 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' 99 రోజుల కార్యక్రమంలో భాగంగా సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. బాలల భద్రత, రక్షణ మరియు 'మత్తు పదార్థాలకు నో చెప్పండి' (Say No to Drugs) అనే నినాదంతో ఈ నెల 27 నుండి మే 2 వరకు నిర్వహిస్తున్న సంక్షేమ వారోత్సవాలను ఆయన ప్రారంభించారు.

**అండగా ఉంటాం.. ఆదుకుంటాం**

జిల్లాలోని చైల్డ్ కేర్ ఇన్స్టిట్యూషన్లలో (CCIs) ఆశ్రయం పొందుతున్న బాలల సంక్షేమానికి జిల్లా యంత్రాంగం నిరంతరం కృషి చేస్తుందని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా 18 ఏళ్ల లోపు బాలబాలికలకు ప్రభుత్వం తరపున వివిధ గుర్తింపు పత్రాలను ఆయన పంపిణీ చేశారు. ఇందులో ముఖ్యంగా.. జనన ధృవీకరణ పత్రాలు, కుల, నివాస ధృవీకరణ పత్రాలు, హెల్త్ కార్డులు, బ్యాంక్ సేవింగ్స్ ఖాతా పుస్తకాలు, ఆధార్ కార్డులను అందజేశారు.

**సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలి..**

కలెక్టర్ మాట్లాడుతూ.. శిశు సంరక్షణ సంస్థల్లో ప్రభుత్వం కల్పిస్తున్న వసతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. చదువు ఒక్కటే పేదరికం నుండి బయటపడేస్తుందని ఉన్నత శిఖరాలను అధిరోహించడానికి నిరంతర కృషి అవసరమని హితవు పలికారు. బాలల భద్రత విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని ఆయన నొక్కి చెప్పారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ (ఇంచార్జ్) వై. అశోక్ రెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి కృష్ణవేణి పాల్గొన్నారు. వారితో పాటు జిల్లా పరిషత్ సీఈఓ ప్రేమ్ కరణ్ రెడ్డి, జిల్లా బాలల పరిరక్షణ అధికారి కె. గణేష్, చైల్డ్ లైన్ జిల్లా కోఆర్డినేటర్ బి. మహేశ్ మరియు బాలల పరిరక్షణ విభాగ సిబ్బంది పాల్గొన్నారు.


## విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

వేసవి క్రీడా శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్



**రాజేంద్రనగర్, మహా ;** గ్రేటర్ హైదరాబాద్ జిహెచ్ఎంసి పరిధి శంషాబాద్ లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం శంషాబాద్ జోనల్ కమిషనర్ చంద్రకళ తో కలిసి ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ జిహెచ్ఎంసి సమ్మర్ క్యాంప్ 2026 ను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలన్నారు,అప్పుడే శారీరక మరియు మానసిక దృఢత్వం లభిస్తుందన్నారు. వేసవి సెలవులను వృధా కాకుండా, ప్రభుత్వం కల్పించిన అద్భుతమైన అవకాశాన్ని విద్యార్థులు, యువత, సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థుల కోసం అన్ని రకాల వసతులు కల్పించిన అధికారులను ఈ సందర్భంగా అభినందించారు.ఈ వేసవి శిబిరం (ఏప్రిల్ 27, 2026) మే 30, వరకు కొనసాగుతుంది.విద్యార్థులు, యువత పెద్ద సంఖ్యలో ఈ శిబిరంలో పాల్గొని వివిధ క్రీడ శిక్షణ శిబిరాల్లో పాల్గొనవచ్చునున్నారు.ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి డిప్యూటీ కమిషనర్ సుమన్ రావు,పార్టీ నాయకులు గణేష్ గుప్తా, వెంకటేష్ గౌడ్, మాజీ చైర్మన్ సుష్మ మహేందర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్లు వెంకటేష్, జహంగీర్ ఖాన్, సంజయ్ యాదవ్, జిహెచ్ఎంసి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సామూహిక విరాళాలతో అక్షయపాత్ర ప్రారంభించిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్




**రాజేంద్రనగర్, మహా ;** శంషాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 'అక్షయపాత్ర పిడికెడు బియ్యం దానం కార్యక్రమం గొప్ప లక్ష్యంతో మరియు సామూహిక భాగస్వామ్యంతో ప్రిన్సిపల్ డా, హిమబిందు తో కలిసి సోమవారం ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ప్రారంభించారు. సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూపంచుకునే స్ఫూర్తి మరియు సామాజిక బాధ్యతను ప్రతిబింబిస్తూన్న అక్షయపాత్ర కార్యక్రమాన్ని చేపట్టడం స్ఫూర్తిదాయకమన్నారు. విద్యార్థులలో మానవతా విలువలను ప్రోత్సహిస్తున్నందుకు సంస్థను ప్రశంసించారు.సామూహిక విరాళాల ద్వారా నిరుపేదలకు సహాయం చేసే లక్ష్యంతో ఇంతటి కార్యక్రమాన్ని ప్రారంభించినందుకు,ఈ మంచి ఆలోచనతో చేపట్టిన కార్యక్రమం నిరంతరం కొనసాగాలన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం, హిమబిందును ఎమ్మెల్యే అభినందించారు.కార్యక్రమంలో పలువురు నాయకులు డిగ్రీ కళాశాల ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

### మత్తుపై 'మహా' సమరం
## బాలల రక్షణే లక్ష్యం..

- బాలల రక్షణ, భద్రతకు పెద్దపీట..
- నేటి నుంచే జిల్లాలో సంక్షేమ వారోత్సవాలు..
- ప్రజావాణి అర్జీలను వెనువెంటనే పరిష్కరించాలి..
- జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ ఆదేశం..





**నల్గొండ, మహా :** జిల్లాలో మత్తు పదార్థాల రహిత సమాజం దిశగా అడుగులు వేయాలని ముఖ్యంగా యువతను, విద్యార్థులను ఈ వ్యసనాల నుంచి కాపాడాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' 99 రోజుల కార్యక్రమంలో భాగంగా..సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన 'ప్రజావాణి'లో ఆయన ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఏప్రిల్ 27 నుండి మే 2 వరకు నిర్వహించనున్న 'బాలల భద్రత, రక్షణ మరియు మత్తు పదార్థాలకు నో చెప్పండి' సంక్షేమ వారోత్సవాల కార్యాచరణపై అధికారులకు దిశానిర్దేశం చేశారు.

**విద్యార్థులపై ప్రత్యేక దృష్టి..**

మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించేలా ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. పోలీస్, విద్యా, సంక్షేమ శాఖల సమన్వయంతో మండల స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు చైతన్య కార్యక్రమాలు నిర్వహించాలని చెప్పారు. ఈ వారంలోనే జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో మత్తు పదార్థాల విముక్తి కేంద్రాన్ని (డీఅడిక్షన్ సెంటర్) అందుబాటులోకి తీసుకురావాలని సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్లు, మండల ప్రత్యేక అధికారులు క్షేత్రస్థాయిలో ఉండి ఈ వారోత్సవాలను విజయవంతం చేయాలని స్పష్టం చేశారు.

**పాలనలో వేగం.. పారదర్శకత..**

వచ్చే నెల నుండి జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో 'ఈఆఫీస్' విధానాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయాలని ఫైళ్లన్నీ ఆన్‌లైన్ ద్వారానే పంపాలని కలెక్టర్ ఆదేశించారు. ఉద్యోగుల బదిలీల ప్రక్రియను అత్యంత పారదర్శకంగా నిర్వహించాలని చెప్పారు. అలాగే జిల్లాలో నిరుద్యోగ యువత కోసం త్వరలో భారీ జాబ్ మేళా నిర్వహించనున్నట్లు తెలుపుతూ.. అన్ని శాఖల్లో ఉన్న ఖాళీల వివరాలను ఈ నెల 30లోగా యువజన సర్వీసుల శాఖకు అందజేయాలని ఆదేశించారు. ఇందిరమ్మ గృహ నిర్మాణాలు పూర్తయిన చోట వెంటనే గృహప్రవేశాలకు ఏర్పాట్లు చేయాలని ప్రజలు తమ స్వీయ జనగణనను త్వరగా పూర్తి చేసేలా అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. మంగళవారం జిల్లాకు రాష్ట్ర సమాచార హక్కు చట్టం కమిషన్ రానున్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని సంబంధిత దరఖాస్తులు, రిజిస్టర్లను సిద్ధం చేసుకోవాలని సూచించారు. ప్రజావాణి ద్వారా వచ్చిన ప్రతి ఫిర్యాదును ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతగా భావిస్తోందని, సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని తెలిపారు. కాగా ఈ సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో రెవెన్యూ విభాగానికి 58, ఇతర శాఖలకు 39 చొప్పున మొత్తం 97 ఫిర్యాదులు అందాయి. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ వై. అశోక్ రెడ్డి, ట్రైనీ ఐఏఎస్ ఎన్. శ్రీకాంత్ రెడ్డి, ఆర్డీవోలు రమణారెడ్డి, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

## పెట్రోల్ కొరత లేదని ఎవడన్నాడు..?

- బంకుల వద్ద వాహనదారుల క్యూ!
- ప్రభుత్వాలు, అధికారులు చెబుతున్నది వేరయా..
- షాద్ నగర్ లో పెట్రోలు డీజిల్ దొరక్క అగచాట్లు
- కొన్ని చోట్లలో పోలీస్ పహారాలో పెట్రోల్ డీజిల్ సరఫరా..



**షాద్ నగర్, మహా:** ఎవడన్నాడు పెట్రోల్ డీజిల్ కొడత లేదని.. మా షాద్ నగర్ రండి కావలసినంత కొరత ఉంది. ఓ వైపు ప్రభుత్వ అధికారులు, మరోవైపు ప్రజా ప్రతినిధులు పెట్రోల్ డీజిల్ కొరతలేదని చెబుతూ కాలక్షేపం చేస్తుంటే సామాన్యుడు నడిబజారులో వాహనం చేత పట్టుకుని నెట్టుకుంటూ తోసుకెళ్తున్నాడు. మరోవైపు చేతిలో క్యాన్ డబ్బాలు పట్టుకొని పరిగెత్తుతున్నాడు. ఇవన్నీ కనిపిస్తున్న అధికారులు పెట్రోల్ డీజిల్ కొరతలేదని బుకాయిస్తున్నారు. గత రెండు రోజులుగా రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణంలో తీవ్రమైన పెట్రోల్ డీజిల్ కొరత ఏర్పడింది. ప్రజలు తమ పనులు చేసుకోలేక రాకపోకలు కొనసాగించలేక తీవ్ర అవస్థలు పడుతున్నారు. కొన్ని వాహనాలు తమ ఇండ్లకే పరిమితమయ్యాయి. అంతేకాదు తెలంగాణలో పలు చోట్ల పెట్రోల్, డీజిల్ కొరత సమస్య వెంటాడుతోందనీ ప్రజలు చెబుతున్నారు. చాలా ప్రాంతాల్లో నో స్టాక్ బోర్డులు దర్శనమిస్తున్నాయనీ పెట్రోల్ దొరుకదన్న భయంతో వాహనదారులు బంకుల దగ్గర క్యూ కడుతున్నారు. పెట్రోల్, డీజిల్ లేక వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరోవైపు కొన్ని ప్రాంతాలలో బంకు యజమానులే కృత్రిమ కొరత సృష్టించి బ్లాక్‌లో విక్రయిస్తున్నారని వాహనదారులు ఆరోపిస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి ఇంధన సరఫరాను పునరుద్ధరించాలని కోరుతున్నారు. మరోవైపు పెట్రోల్, డీజిల్ కొరతపై ప్రజల్లో అయోమయం నెలకొంది. అసలే వివాహాల సీజన్ పెట్రోల్ డీజిల్ లభించక కార్యాలన్నీ అనేక కారణాల చేత చెడిపోతున్నాయి. ముఖ్యంగా ఇతర వ్యాపార లావాదేవీలు కూడా ఆగిపోయాయి. ప్రజలు ఇంట్లో నుండి బయటికి కాలు పెట్టలేని పరిస్థితి. పోవైపు మాడుతున్న ఎండలు మరోవైపు పెట్రోల్ డీజిల్ కొరతతో పూర్తిగా సతమతం అవుతున్నారు. షాద్ నగర్లో పెట్రోల్ బంక్ లు మూత , షాద్ నగర్ పట్టణం లోని మిలీనియం టౌన్షిప్ ఎదుటా ఒక బంక్ లో బారులు తీరిన వాహనాలు పోలీస్ పహారాలో పెట్రోల్ డీజిల్ సరఫరా.. జరుగుతున్న తీరు చూస్తే పరిస్థితి అర్థమవుతుంది.

# పానగల్ బైపాస్‌పై మృత్యుఘోష లారీని ఢీకొన్న కారు..

సాఫ్ట్ వేర్ ఇంజినీర్ దుర్మరణం..



**నల్లగొండ టౌన్, మహా :** నిశ్శబ్దంగా ఉన్న ఆ తెల్లవారు జామున పానగల్ ఫ్లైఓవర్‌పై మృత్యువు మాటువేసింది. కన్నవారిని చూసి, సొంతూరి జ్ఞాపకాలను మూటగట్టుకుని విధుల్లో చేరేందుకు వెళ్తున్న ఆ యువకుడిని విధి వంచించింది. నిలిపి ఉంచిన లారీ రూపంలో మృత్యువు కబళించడంతో ఒక నిండు ప్రాణం గాలిలో కలిసిపోయింది. నల్లగొండ పట్టణ శివారులోని పానగల్ బైపాస్ ఫ్లైఓవర్‌పై సోమవారం తెల్లవారుజామున జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ సాయి సందీప్ (25) అక్కడికక్కడే మృతి చెందారు.పల్నాడు జిల్లా నరసరావుపేటకు చెందిన సాయి సందీప్ హైదరాబాద్‌లోని ఒక ప్రముఖ సాఫ్ట్‌వేర్ సంస్థలో పనిచేస్తున్నారు. సెలవు ముగించుకుని తన కారులో స్వగ్రామం నుంచి హైదరాబాద్‌కు బయల్దేరారు. తెల్లవారుజామున నల్లగొండ సమీపంలోని పానగల్ ఫ్లైఓవర్‌పైకి రాగానే అక్కడ రోడ్డు పక్కన నిలిపి ఉంచిన లారీని సందీప్ ప్రయాణిస్తున్న కారు వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ప్రమాదం జరిగిన సమయంలో కారు అత్యంత వేగంతో ఉన్నట్లు తెలుస్తోంది. లారీ వెనుక భాగాన్ని ఢీకొట్టిన ధాటికి కారు ముందు భాగం పూర్తిగా నుజ్జునుజ్జయ్యి లారీ కిందకు దూసుకుపోయింది. ఈ భీభత్సమైన ప్రమాదంలో సందీప్ శరీరానికి తీవ్ర గాయాలై కారు లోపలే ఇరుక్కుపోయి ప్రాణాలు విడిచారు. సమాచారం అందుకున్న వెంటనే నల్లగొండ టూటౌన్ పోలీసులు రంగంలోకి దిగారు, ఎస్ఐ సైదులు స్వయంగా ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలను పర్యవేక్షించారు. గ్యాస్ కట్టర్ల సాయంతో కారు భాగాలను కట్ చేసి లోపల ఇరుక్కుపోయిన సందీప్ మృతదేహాన్ని అతికష్టంపై వెలికితీశారు. ప్రమాదం కారణంగా ఫ్లైఓవర్‌పై వాహనాలు నిలిచిపోవడంతో పోలీసులు క్రేన్ సాయంతో ధ్వంసమైన కారును పక్కకు తొలగించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. పోలీసులు సందీప్ ఫోన్ ఆధారంగా కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. చేతికందిన కొడుకు విగతజీవిగా పడి ఉన్నాడన్న వార్త వినగానే తల్లిదండ్రులు కుప్పకూలిపోయారు.

# Mahaa First

మహా
తెలుగు దినపత్రిక
దమ్మున్న వార్తల వేదిక

## స్కాన్ చేయండి.. ఫాలో అవ్వండి






## వాయు వేగంతో

Join Our Exclusive
WhatsApp Channel

## రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమము

### మండల వ్యవసాయ అధికారి విజయచంద్ర

**మొయినాబాద్ మహా:** మొయినాబాద్ మండలం లోని కేతిరెడ్డిపల్లి గ్రామంలో పీజేటీఎస్ఏయూ (వ్యవసాయ విశ్వవిద్యాలయం) మరియు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమము రాబోయే వానాకాలం (ఖరీఫ్) సీజన్ 2026 కు సంబంధించిన నాణ్యమైన విత్తనాల ఎంపిక, కొత్త సాంకేతిక పద్ధతులు, మెరుగైన సాగు విధానాలు, ఎరువుల వినియోగం, పురుగు తెగుళ్ల నియంత్రణ, నీటి నిర్వహణ, మరియు ఇతర సాంకేతిక సలహాలు వంటి ముఖ్యమైన అంశాలపై వ్యవసాయ శాస్త్రవేత్తలతో రైతులకు ముఖాముఖి సమావేశం మొయినాబాద్ మండలంలోని కేతిరెడ్డిపల్లి గ్రామపంచాయతీ నందు 28042026 రోజున ఉదయం 8.00 గంటలకి నిర్వహించడం జరుగుతుందని మండల వ్యవసాయ అధికారి విజయచంద్ర తెలిపారు. ఇట్టి కార్యక్రమానికి పెద్దలు, వివిధ గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు, ఎరువులు, పురుగుమందులు, విత్తన డీలర్లు, వ్యవసాయ సహకార సంఘాల స్టాఫ్, ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ సభ్యులు, రైతు సోదరులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయగలరని కోరారు.

# జిల్లాలో పెట్రోల్ డీజిల్ కొరత లేదు..!

- జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి వెల్లడి..
- క్షేత్రస్థాయిలో సమీక్ష నిర్వహిస్తున్న అధికారులు
- వినియోగదారులు కృత్రిమ కొరతకు సృష్టించవద్దు



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** జిల్లాలో పెట్రోల్ డీజిల్ కు ఎలాంటి కొరత లేదని ప్రజలకు నమ్మకం కలిగించాలని, రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి సేల్స్ ఆఫీసర్లకు సూచించారు. సోమవారం రంగారెడ్డి జిల్లాలో కొన్ని పెట్రోల్ బంకుల్లో పెట్రోల్ డీజిల్ కొరత ఉన్నటువంటి పరిస్థితిపై జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి, జిల్లా ఎనర్జీ మానిటరింగ్ కమిటీ సభ్యులతో ఆయిల్ కంపెనీ సేల్స్ ఆఫీసర్లు, పౌరసరఫరాల శాఖ అధికారులతో పాటు పెట్రోల్ బంక్ డీలర్స్ తో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి పరిస్థితిని సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ... ఆయిల్ కంపెనీ సేల్స్ ఆఫీసర్లు పెట్రోల్ బంక్ డీలర్లను ఎక్కువ మొత్తంలో కొద్దిమంది వినియోగదారులకు అమ్మకాలు జరపకుండా చూడాలని, అదేవిధంగా అందరి వినియోగదారులు సాధారణ పద్ధతిలోని రోజువారి కొనుగోలు జరపాలని, ఎక్కువ మొత్తంలో కొనుగోలు చేసి ప్రమాదాలకు కారణం కారాదని తెలుపుతూ, ఈ విషయాన్ని కంపెనీ ప్రతినిధులతో పాటు, టెలి కాన్ఫరెన్స్ లో పాల్గొన్న అధికారులు కూడా సాధారణ ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో సమీక్ష నిర్వహిస్తున్న అధికారులు పరిస్థితి కొంత మెరుగుపడాలంటే కంపెనీలు సరఫరా పెంచడంతో పాటు పెట్రోల్ బంకుల్లో ఒక్క వినియోగదారునికి అధిక మొత్తంలో అమ్మకాలు జరపడం ఆపాలని అదేవిధంగా వినియోగదారులు కూడా అనవసరంగా కొనుగోలు చేసి కృత్రిమ కొరతకు కారణం కారాదని ఆయన తెలిపారు. ఆయిల్ కంపెనీల ప్రతినిధులు, సేల్స్ ఆఫీసర్లు మాట్లాడుతూ.... ప్రజలు అనవసర భయాందోళనలకు గురై ఎక్కువ మొత్తంలో కొనుగోలు చేయడం వలన కృత్రిమ కొరత ఏర్పడిందని తెలిపారు. అదేవిధంగా పెట్రోల్ బంకులు యజమానులు సమీక్షలో భాగంగా మాట్లాడుతూ... ఆయిల్ కంపెనీలు సరఫరా పెంచితే ఎలాంటి ఇబ్బంది ఉండదని తెలిపారు.

## 25వ బారాసా పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**రాజేంద్రనగర్, మహా ;** శంషాబాద్ మండల పార్టీ అధ్యక్షులు మంచర్ల మోహన్ రావు ఆధ్వర్యంలో సోమవారం శంషాబాద్ జిహెచ్ఎంసి పరిధిలోని రంగారెడ్డి జిల్లా బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో భారాసా పార్టీ 25వ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. శంషాబాద్ మండలం పెద్ద తూప్రా గ్రామంలో బారాసా నాయకులు దిద్యాల శశికాంత్ ఆధ్వర్యంలో మాజీ ఎంపీపీ దిద్యాల జయమ్మ శ్రీనివాస్ భారాసా 25వ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా పార్టీ జెండాను ఆవిష్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కాటేదాన్ డివిజన్ పరిధిలో డివిజన్ అధ్యక్షులు ఎస్ వెంకటేష్ ఆధ్వర్యంలో బారాసా పార్టీ 25వ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను పార్టీ జెండాను ఆవిష్కరించి ఘనంగా నిర్వహించారు. నర్సింగ్ సర్కిల్ అధ్యక్షులు విష్ణువర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో బారాసా పార్టీ 25వ ఆవిర్భావ దినోత్సవ వేడుకను పార్టీ జెండాను ఆవిష్కరించి ఘనంగా జరుపుకున్నారు.బారాసా నాయకులు మాట్లాడుతూ రాబోయే రోజులలో బిఆర్ఎస్ ప్రభుత్వమే రాబోతుంది అందరు కలిసికట్టుగా పనిచేసి పార్టీ అభివృద్ధికి తోడ్పడాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ అధ్యక్షులు, డివిజన్ అధ్యక్షులు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణిలో ప్రజా సమస్యల సత్వర పరిష్కారం..!

- జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి
- ఫిర్యాదులపై సంబంధిత అధికారులకు ఆదేశాలు జారి
- స్వీయ జనగణన ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవచ్చు.!



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** సమీకృత జిల్లా కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 65 ఫిర్యాదులు అందాయని జిల్లా కలెక్టర్ సి నారాయణరెడ్డి తెలిపారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో, జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదు దారులు తమ సమస్యలను జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డికి విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పరిష్కరించాలని అధికారులను హెచ్చరించారు. అనంతరం జనాభా గణన 2027 కార్యక్రమం ప్రారంభం పై జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి మాట్లాడుతూ జనాభా గణన 2027 కార్యక్రమం ప్రారంభం కానున్న నేపథ్యంలో జిల్లాలోని ప్రతి ఒక్కరు స్వీయ గణనలో పాల్గొని వారి యొక్క వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. స్వీయ గణన ఆన్ లైన్ పోర్టల్ (se.census.gov.in) వెబ్ సైట్ ను సందర్శించి సెల్ఫ్ డిక్లరేషన్ ఐడి పొందాలని, ఏప్రిల్ 26 నుండి మే 10 వరకు జరిగే గణన లో గుర్తించబడిన ఉద్యోగులు సర్వే నిమిత్తం ఇంటికి వచ్చినపుడు మీ ఐడి వివరాలు తెలియపరచాలని అన్నారు. ఈ సందర్భంగా జిల్లా సెన్సస్ ఇంచార్జి అధికారి శిరీష పవర్ పాయింట్ ప్రెసెంటేషన్ ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి (రెవెన్యూ), కిరణ్మయి (లోకల్ బాడీస్) జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, వివిధ శాఖల జిల్లా అధికారులు, సూపరింటెండెంట్లు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.


# నిరాహార దీక్షలు 33వ రోజుకు చేరిక

### కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



**బూర్గంపహాడ్ మహా :** ఐటీసీ పీఎస్పీడీ భద్రాచలం యూనిట్ చరిత్రలో కాంట్రాక్ట్ కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం రిలే నిరాహార దీక్షలు చేపట్టడం ఇదే తొలిసారి అని కార్మిక సంఘాల నాయకులు తెలిపారు. మండుటెండలను సైతం లెక్క చేయకుండా న్యాయమైన డిమాండ్ల సాధన కోసం కాంట్రాక్ట్ కార్మికులు 33 రోజులుగా నిరంతరంగా రిలే నిరాహార దీక్షలు కొనసాగిస్తున్నారు. యాజమాన్యం మొండి వైఖరిని నిరసిస్తూ ఈ రోజు జరిగిన దీక్షలో సంధి పాముబాబు, బోనం నాగిరెడ్డి, రేగుమూడి రాంబాబు, పోడుతూరి రాజా, దార్ల కవిత, పార్శిక మల్లిక పాల్గొన్నారు. వారికి ఐటీసీ ఐఎన్టీయూసీ జనరల్ సెక్రటరీ యారం పిచ్చిరెడ్డి పూలమాల వేసి దీక్షను ప్రారంభించారు.ఈ దీక్షకు మద్దతుగా ఐటీసీ బీఆర్టీయూ అధ్యక్షుడు, ఐటీసీ ఎంప్లాయీస్ కార్మిక జేఏసీ కన్వీనర్ సానికొమ్ము శంకర్ రెడ్డి, బీఆర్టీయూ నాయకులు కోమటిరెడ్డి రాజశేఖరరెడ్డి, కొండారెడ్డి దీక్షా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంట్రాక్ట్ కార్మిక సంఘాల జేఏసీ కన్వీనర్ పాటి సోమిరెడ్డి, కోకన్వీనర్ బల్లెం నాగయ్య, జేఏసీ సభ్యులు కందల వెంకటరెడ్డి, చుక్కపల్లి బాలాజీ, మేకల శేషమ్మ, కోడూరు శ్రీనివాసరావు తదితరులతో పాటు ప్లాంటేషన్ మహిళా కార్మికులు కూడా పాల్గొన్నారు .ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, రాబోయే మూడు రోజులలో కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై యాజమాన్యం జేఏసీతో చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సమ్మెకు వెళ్లేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకున్నామని హెచ్చరించారు. అలాగే, కాంట్రాక్ట్ కార్మికులందరూ జేఏసీ పిలుపు మేరకు సమ్మెకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.

# డ్రైనేజీ వేసి రోడ్డు మరిచిన జిహెచ్ఎంసి..



**రాజేంద్రనగర్ మహా ;** శంషాబాద్ సర్కిల్ పరిధిలోని 119 డివిజన్లో సీసీ రోడ్ ను తవ్వి అండర్ డ్రైనేజీ వేశారు. డ్రైనేజీ కోసం తవ్విన గుంతలను మర్చి పోయారు. దీంతో కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తొవ్విన గుంతలను రోడ్డు వెయ్యక పూడ్చలేక జిహెచ్ఎంసి అధికారులు వదిలి వెళ్లారు. గుంతల్లో డ్రైనేజీ నీరు నిల్వ ఉండడంతో తీవ్రమైన దోమల సమస్యలతో కాలనీ వాసులు ఆస్పత్రి పాలయ్యారు. అనేకమంది చిన్నారులు వృద్ధులు, తవ్విన గుంతలో పడి గాయాలపాలయ్యారు. ఓ పక్క దోమలతో మరోపక్క గుంతలో పడి ఆసుపత్రి పాలవుతున్నారు. బిజెపి శంషాబాద్ అధ్యక్షులు దేవేంద్ర ఆధ్వర్యంలో బిజెపి నాయకులతో కలిసి సోమవారం జిహెచ్ఎంసి జోనల్ కమిషనర్ చంద్రకళకు వినతి పత్రం అందజేశారు. రోడ్డు సమస్యను త్వరగా పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో పలువులు బిజెపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మణుగూరులో ఘనంగా బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు..

### జెండా ఆవిష్కరించిన మండల అధ్యక్షుడు కుర్రి నాగేశ్వరరావు..



**మణుగూరు, మహా :** బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని సోమవారం మణుగూరులో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయం ఎదుట మండల అధ్యక్షుడు కుర్రి నాగేశ్వరరావు పార్టీ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కుర్రి నాగేశ్వరరావు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తోందని, ప్రతి కార్యకర్త పార్టీ బలోపేతానికి కట్టుబడి పనిచేయాలని అన్నారు. ప్రజల సంక్షేమమే మా పార్టీ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. పార్టీ నేతలు, కార్యకర్తలు పార్టీ విజయాలకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టౌన్ అధ్యక్షుడు కుంటా లక్ష్మణ్, మాజీ జెడ్పిటిసి పోశం నరసింహారావు, వట్టం రాంబాబు, ఎడ్ల శ్రీనివాసరావు, గువ్వా రాంబాబు, ఆవుల నరసింహారావు, అడపా అప్పారావు, వేర్పుల నరేష్, రంజిత్, అక్కిని నరసింహారావు, ముత్యం బాబు, తురక రామ్ కోటి, సురేష్, కంభంపాటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## భారత రాష్ట్ర సమితి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహణ



**బూర్గంపహాడ్ మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం లక్ష్మీపురం గ్రామ పంచాయతీలో భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ కామిరెడ్డి శ్రీలత ముఖ్య అతిథిగా హాజరై పార్టీ జెండాను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పార్టీ ఆవిర్భావం నుంచి ప్రజల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా బీఆర్ఎస్ పనిచేస్తోందని తెలిపారు. పార్టీ శ్రేణులు ఐక్యంగా పనిచేసి గ్రామ స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో లక్ష్మీపురం ఉప సర్పంచ్ యారం పున్నారెడ్డి, వార్డు సభ్యులు ఎటుకూరి కోటయ్య, మడకం నాగేశ్వరరావు, తోకల రమణ, గద్దల రత్నకుమారి, బొల్లా మాహేశ్వరి, మాజీ వార్డు సభ్యుడు పాలెం దివాకర్ రెడ్డి, మారం పాపిరెడ్డి, గద్దల ప్రకాష్తో పాటు గ్రామ పెద్దలు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పలు పెట్రోల్ బంకుల వద్ద నో స్టాక్ బోర్డులు

### పెట్రోల్ కోసం బంకుల వద్ద మాడ పలిగే ఎండలో బారులు తీరిన వాహనదారులు....



**రాజేంద్రనగర్, మహా ;** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని రాజేంద్రనగర్, శంషాబాద్ పలు ప్రాంతాల్లో ఉన్న చాలా పెట్రోల్ బంకులు మూతపడడంతో వాహనదారుల్లో తీవ్ర భయాందోళనలు నెలకొంటున్నాయి. మాడ పలిగే ఎండలలో తమ వాహనాలను తీసుకొని పెట్రోల్ నిల్వలు ఉన్న బంకుల వద్ద భారీగా క్యూ లైన్లు కడుతున్నారు. రాజేంద్రనగర్ శంషాబాద్ పరిధిలోని పలు పెట్రోల్ బంకులలో నో స్టాక్ బోర్డులు పెట్టడంతో వాహనదారులు అలర్ట్ అయ్యారు. వాహనాలు తీసుకొని పెట్రోల్ నిలువలు ఉన్న బంకుల వద్ద 40 డిగ్రీలు దాటిన ఎండలలో భారీగా క్యూ లైన్ లు కడుతున్నారు. పెట్రోల్ బంకులు సృష్టిస్తున్న కొరతన లేక నిజమైన కొరత అనేది వాహనదారులు అయోమయానికి గురవుతున్నారు.

# రైతు కన్నీరు మున్నీరుగా మారుతోంది

### వెంటనే వరి ధాన్యం కొనుగోలు చేయాలి: సిపిఎం మండల కమిటీ డిమాండ్



**బూర్గంపహాడ్ మహా :** యాసంగి పంటను పండించిన రైతులు వరి ధాన్యాన్ని మార్కెట్ యార్డులకు తీసుకు వచ్చినా కొనుగోలు చేసే పరిస్థితి లేక తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారని సిపిఎం బూర్గంపాడు మండల కమిటీ ఆరోపించింది. రైతులు ధాన్యాన్ని పొలాల్లో ఆరబోసి, మార్కెట్ యార్డుల్లో రోజులు గడుపుతూ దిక్కుతోచని స్థితిలో ఎదురుచూస్తున్నారని మండల కార్యదర్శి బత్తుల వెంకటేశ్వర్లు తెలిపారు.సిపిఎం పార్టీ బూర్గంపాడు మండల కమిటీ ఆధ్వర్యంలో యార్డును సందర్శించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు అనేక నిబంధనలు విధించి రైతులు మళ్లీ వరి పంట వేయకుండా చేయాలనే కుట్రతో వ్యవహరిస్తున్నాయని విమర్శించారు.ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడంతో రైతులు దళారుల చేతిలో దారుణంగా మోసపోతున్నారని అన్నారు. కాటా 72 కిలోల ధాన్యాన్ని కేవలం రూ.1200కే అమ్మాల్సిన పరిస్థితి నెలకొనగా, ఆరిన ధాన్యాన్ని దళారులు రూ.1390కు విక్రయిస్తున్నారని తెలిపారు. అకాల వర్షాలు వస్తాయేమోనన్న భయంతో రైతులు వచ్చిన ధరకే ధాన్యాన్ని అమ్ముకునే దుస్థితి ఏర్పడిందన్నారు.ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం కఠిన నిబంధనలు విధించిందని, తేమ 17 శాతం మాత్రమే ఉండాలి, చెత్త తాలు 1 శాతం, మట్టి, రాళ్లు 1 శాతం, చెడిపోయిన లేదా రంగు మారిన, మొలకెత్తిన, పురుగు తిన్న ధాన్యం 5 శాతం, పూర్తిగా తయారు కాని ముడుచుకుపోయిన ధాన్యం 3 శాతం, తక్కువ రకాల మిశ్రమం పరిమితంగా ఉండాలనే షరతులతో రైతులను ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. ఇవే కాకుండా టోకెన్ నెంబర్, ఆధార్ కార్డు జిరాక్స్, భూమి పట్టా పాసుబుక్, బ్యాంక్ పాస్‌బుక్, ఆధార్‌కు లింక్ అయిన ఫోన్ నెంబర్, సాగు ధృవీకరణ పత్రం వంటి పలు పత్రాలు తప్పనిసరి చేయడం రైతులకు మరింత భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని, లేకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. రైతులకు ప్రాణ నష్టం జరిగితే ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని సిపిఎం డిమాండ్ చేసింది. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు భయ్యా రాము, సోమయ్య, కృష్ణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

# ఘనంగా బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**జూలూరుపాడు, మహా:** బిఆర్ఎస్ పార్టీ 26వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను సోమవారం మండల కేంద్రంలోని యల్లంకి నివాసం వద్ద ఆ పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఆ పార్టీ సీనియర్ నాయకులు యల్లంకి సత్యనారాయణ పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనే లక్ష్యంగా కేసీఆర్ బీఆర్ఎస్ పార్టీని స్థాపించి అన్ని వర్గాలను ఏకం చేశారని పేర్కొన్నారు. అభివృద్ధిలో తెలంగాణను దేశంలోనే నెంబర్ వన్ గా నిలిపిన ఘనత కేసీఆర్ కు దక్కుతుందన్నారు. ఇప్పటికీ, ఎప్పటికి తెలంగాణ రాష్ట్రానికి కేసీఆర్ శ్రీ రామ రక్ష అని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు చాపలమడుగు రామ్మూర్తి, రైతు సమన్వయ సమితి మాజీ అధ్యక్షులు యదళపల్లి వీరభద్రం, మాజీ సొసైటీ డైరెక్టర్ భూక్యా జోహార్ లాల్, గుండెపూడి ఉప సర్పంచ్ బాదావత్ నరేష్, బీఆర్ఎస్ పార్టీ మండల నాయకులు తాళ్లూరి రామారావు, గుమ్మడి వెంకటేశ్వర్లు, బుడిపూడి ప్రభాకర్, ఇల్లంగి తిరుపతి, పోతురాజు రామారావు, పురస్తపురవు రామకృష్ణ, బండారి వెంకయ్య, బుడిపూడి ప్రతాప్, పోతురాజు కృష్ణ, ఈసాల వెంకటేష్, ముకేష్, చందు తదితరులు పాల్గొన్నారు.

## ఆదిభట్లలో కన్నుల పండుగగా

# బీరప్ప కామరాతిదేవి కళ్యాణం...

- కళ్యాణంలో పాల్గొన్న ఎమ్మెల్యే రంగారెడ్డి సంతోషం వ్యక్తం
- భక్తిశ్రద్ధలతో బీరప్ప స్వామికి బోనాలు సమర్పించిన మహిళలు
- కుర్మ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా స్వామివారి కల్యాణం



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** ఆదిభట్ల గ్రామంలో కుర్మ సంఘం ఆధ్వర్యంలో భక్తి శ్రద్ధలతో, వైభవంగా నిర్వహించిన అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడు శ్రీ శ్రీశ్రీ బీరప్ప స్వామి కామరాతిదేవి కళ్యాణం వైభవంగా కన్నుల పండుగగా జరిగింది. ఈ కళ్యాణ మహోత్సవానికి ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారి ఆశీర్వాదాలు పొందడం జరిగింది. అనంతరం ఆయన మాట్లాడుతూ...కుర్మసంఘం సభ్యులు అత్యంత వైభవంగా నిర్వహించిన బీరప్ప కామరాతి కళ్యాణంలో పాల్గొనడం తనకెంతో సంతోషంగా ఉందని ఎమ్మెల్యే తెలిపారు. కళ్యాణ మహోత్సవ కార్యక్రమం అత్యంత ఘనంగా నిర్వహించినందుకు కురుమ సంఘం సభ్యులను, ఎమ్మెల్యే రంగారెడ్డి అభినందించారు. నియోజకవర్గ రాష్ట్ర ప్రజలు సుఖ సంతోషాలతో సుభిక్షంగా వర్ధిల్లాలని ఆ యొక్క బీరప్ప కామరాతి దేవిని కోరినట్లు ఎమ్మెల్యే తెలిపారు. కుర్మ సంఘం సభ్యులు ఎమ్మెల్యే రంగారెడ్డికి జ్ఞాపికను అందజేశారు.

**మూడు రోజుల బీరప్ప పండుగ.....**

జిహెచ్ఎంసి పార్టీ శంషాబాద్ జోన్ ఆదిభట్ల సర్కిల్ పరిధిలోని ఆదిభట్ల గ్రామంలో 11 సంవత్సరాల తర్వాత కుర్మ సంఘం ఆధ్వర్యంలో ఎంతో అంగరంగ వైభవంగా బీరప్ప కామరాతి కళ్యాణ మహోత్సవం నిర్వహించారు. గత మూడు రోజులుగా నిర్వహించిన కార్యక్రమాలు... శనివారం బీరప్ప స్వామికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. ఆదివారం భక్తులు భక్తిశ్రద్ధలతో బీరప్ప స్వామికి బోనాలు సమర్పించారు. సోమవారం కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. స్వామివారి కల్యాణ మహోత్సవానికి వచ్చిన బంధుమిత్రులతో గ్రామస్తులు సంతోషంగా బీరప్ప పండుగను జరుపుకున్నారు.


**బీరప్ప స్వామి కళ్యాణంలో కిక్కిరిసిన జనం....**

ఆదిభట్ల మున్సిపాలిటీలో జరిగిన శ్రీ బీరప్పస్వామి కామరాతిదేవి కళ్యాణ మహోత్సవం కన్నుల పండువగా జరిగింది. ఈ వేడుకకు సమీప గ్రామాలు, పట్టణాల నుంచి భారీగా భక్తులు తరలివచ్చారు. సంప్రదాయ పూజలు, కార్యక్రమాలు భక్తులను ఆకర్షించాయి. అనంతరం బంధుమిత్రులందరికీ విందు భోజనాలు ఏర్పాటు చేశారు. స్వామివారి కళ్యాణాన్ని వీక్షించిన ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. ఈ యొక్క కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం ఏఎంసీ చైర్మన్ గురునాథ్ రెడ్డి, డిసిసిబి మాజీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య, మున్సిపల్ మాజీ చైర్మన్ మరి నిరంజన్ రెడ్డి, పిఏసిఎస్ మాజీ చైర్మన్లు పాండురంగారెడ్డి, జమ్మ శ్రీశైలం, మాజీ జెడ్పిటిసి మహిపాల్, ఐలయ్య, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు ఈసీ శేఖర్ మామ, పైల్ల శ్రీనివాస్ రెడ్డి, కొత్తకుర్మ శివ కుమార్, బాలం యాదగిరి, జమ్మ రాజు, స్థానిక మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, ఒగ్గు కళాకారులు, గ్రామస్తులు పలు గ్రామాల నుండి వచ్చిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### బిఆర్ఎస్ పార్టీ 26వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా భద్రాచలం

## బిఆర్ఎస్ పార్టీ కార్యాలయం వద్ద

# ఘనంగా గులాబీ జెండా వేడుకలు...




**భద్రాచలం మహా :** బిఆర్ఎస్ పార్టీ 26వ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని భద్రాచలం బిఆర్ఎస్ పార్టీ కార్యాలయం వద్ద ఘనంగా జండా ఆవిష్కరణ చేశారు. బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు రావులపల్లి రాంప్రసాద్ జండా ఆవిష్కరణ చేశారు . తదనంతరం భద్రాచలం నియోజకవర్గ మాజీ ఇంచార్జ్ మానే రామకృష్ణ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అహర్నిశలు పోరాడి తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేసిన బిఆర్ఎస్ పార్టీ గురించి మాట్లాడారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం 6 గ్యారంటీలను అమలు చేయకుండా తెలంగాణ ప్రజలను మోసం చేసింది అంటూ విమర్శించారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం బిఆర్ఎస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

## ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి

# వేగవంతమైన చర్యలు చేపట్టాలి

### జిల్లా కలెక్టర్ అంకిత్



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** ప్రజావాణి కార్యక్రమంలో స్వీకరించిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణీత కాలపరిమితిలో పరిష్కరించేలా వేగవంతమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అంకిత్ జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడీఓసీ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, గృహ నిర్మాణ శాఖ పీడీ రవీంద్రనాథ్, కొత్తగూడెం ఆర్డీవోతో కలిసి కలెక్టర్ ప్రజల వినతులను స్వయంగా స్వీకరించారు. జిల్లాలోని వివిధ మండలాలు గ్రామాల నుండి వచ్చిన ప్రజలు తమ సమస్యలను లిఖితపూర్వకంగా సమర్పించగా వాటిని శ్రద్ధగా విన్న కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులకు వెంటనే ఎండార్స్ చేసి తక్షణ నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో ఎలాంటి నిర్లక్ష్యం చోటుచేసుకోకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అర్హులైన వారికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ప్రజావాణిలో స్వీకరించిన పలు దరఖాస్తులను పరిశీలించి సంబంధిత అధికారులకు మార్గదర్శకాలు జారీ చేశారు. ప్రతి ఫిర్యాదుపై శాఖాధిపతులు వ్యక్తిగత పర్యవేక్షణ చేపట్టి నిర్ణీత గడువులో పరిష్కారం అందించేలా చర్యలు పూర్తి చేయాలని పెండింగ్ లేకుండా చూసుకోవాలని ఆదేశించారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టే విధంగా సమర్థవంతమైన పరిపాలన అందించడంలో అధికారులు కట్టుబడి ఉండాలని తెలిపారు. ప్రజావాణిలో స్వీకరించిన కొన్ని దరఖాస్తులు.. దుమ్ముగూడెం మండలం చిన్న కమలాపురం గ్రామానికి చెందిన పూనెం ముత్తయ్య తన తండ్రి పేరుమీద ఉన్న పట్టాదారు భూమిలో 5.48 సెంట్లు తన పేరుమీదకు మార్పిడి చేయాలని దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. చలాన్ కట్టినప్పటికీ పట్టా మంజూరు కాలేదని చేసిన దరఖాస్తు పరిశీలించిన కలెక్టర్ తగు చర్యల కోసం సంబంధిత సి సెక్షన్ సూపరింటెండెంట్‌కు ఎండార్స్ చేశారు. పాల్వంచ 44వ డివిజన్ గాంధీనగర్‌కు చెందిన వీరమల్ల దుర్గారాణి ఇంటి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నానని ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నానని, తాను డిగ్రీ, ఐటీఐ పూర్తి చేసిన నేపథ్యంలో ఉపాధి కల్పించాలని కోరుతూ చేసిన దరఖాస్తును కలెక్టర్ పరిశీలించి తగు చర్యలు నిమిత్తం ఉపాధి కల్పనాధికారికి ఎండార్స్ చేశారు. పాల్వంచ మండలం సత్యనారాయణపురం గ్రామానికి చెందిన కృష్ణ తన ఆధీనంలో ఉన్న 8 ఎకరాల భూమిలో 2016లో 6ఎకరాలు, ఇటీవల మిగిలిన 2 ఎకరాలు ఫారెస్ట్ అధికారులు స్వాధీనం చేసుకున్నారని జీవనాధారం కోల్పోయానని వాపోయారు. తనకు భూమి తిరిగి ఇవ్వాలని కోరుతూ చేసిన దరఖాస్తును కలెక్టర్ పరిశీలించి పాల్వంచ ఫారెస్ట్ డివిజనల్ ఆఫీసర్ కు ఎండార్స్ చేశారు.

# ఘనంగా బిఆర్ఎస్ అవిర్భావ దినోత్సవం



**కారేపల్లి, మహా :** బీఆరఎస్ అవిర్భావ దినోత్సవాన్ని మండల కేంద్రమైన కారేపల్లిలో సోమవారం ఘనంగా నిర్వహించారు. కారేపల్లి బస్టాండ్ సెంటర్‌లోని తెలంగాణతల్లి విగ్రహం వద్ద బీఆరఎస్ జెండాను ఎగరవేశారు. ఈసందర్భంగా ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ ముత్యాల సత్యనారాయణ, మాజీ జడ్పీటీసీలు ఉన్నం వీరేందర్, వాంకుడోత్ జగన్, మాజీ వైఎస్ ఎంపీపీ రావూరి శ్రీనివాసరావు లు మాట్లాడుతూ మోసపూరిత హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల అగ్రహానికి గుర్రై కూలీ పోయే దశకు వచ్చిందన్నారు. కేసీఆర్ ఆధ్వర్యంలో టీఆరఎస్ ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధికి బాటలు వేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను నమ్మించి మోసం చేస్తుందన్నారు. కార్యకర్తల బలమే బీఆరఎస్‌కు బలమని రానున్నది కేసీఆర్ నాయకత్వంలోని బీఆరఎస్ ప్రభుత్వమన్నారు. ఈకార్యక్రమంలో బీఆరఎస్ నాయకులు తాతా వెంకటేశ్వర్లు, జర్పుల హచ్చు, బానోత్ రాందాస్, జూంకీలాల్, భూక్యా చందునాయక్, సోమందుల నాగరాజు, జాలా సాంబ, పిల్లి వెంకటేశ్వర్లు, గంగరబోయిన సత్యం, మణిగొండ నాగేశ్వరరావు, మురళి, సూరపురెడ్డి తిరుపతిరెడ్డి, చింతల కృష్ణ,గుగులోత్ భగవాన్ తదితరులు పాల్గొన్నారు.

# పిల్లల భద్రతపై అవగాహన కార్యక్రమం విజయవంతం..



**మణుగూరు, మహా :** ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా పిల్లల భద్రత, రక్షణపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని సోమవారం శివలింగాపురం చైల్డ్ హోమ్‌లో నిర్వహించారు. ఐసీడీఎస్, సీడబ్ల్యూసీ, ఈగిల్ బృందం, వైద్య, పోలీసు శాఖల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా డిప్యూటీ డీఎం అండ్ హెచ్ఓ డాక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ పిల్లలు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని, పౌష్టికాహారం తీసుకుంటూ శారీరక, మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. మంచి స్నేహాలను పెంపొందించుకోవాలని, ఎవరైనా శారీరకంగా ఇబ్బందులకు గురిచేస్తే వెంటనే సంబంధిత అధికారులకు తెలియజేయాలని, ఒంటరిగా తిరగకుండా సమూహంగా ఉండాలని సూచించారు.అనంతరం నిర్వహించిన ఆరోగ్య శిబిరంలో పిల్లలకు రక్త పరీక్షలు నిర్వహించగా, రక్త హీనత ఉన్న ఒక బాలికను మెరుగైన చికిత్స కోసం రిఫర్ చేశారు. కార్యక్రమం అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన అధికారులు సమయపాలన పాటించాలని, ఆరోగ్య కార్యక్రమాలన్నింటిని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, లక్ష్యాలను పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమాన్ని అన్ని శాఖల సమన్వయంతో విజయవంతంగా నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా మహిళా అభివృద్ధి అధికారి స్వర్ణలత లెనినా, జిల్లా బాలల పరిరక్షణ అధికారి హరికుమార్, సీఐ నాగబాబు, వైద్యులు ఉమాదేవి, పావని, సీడీపీఓ జయలక్ష్మి పాల్గొన్నారు.

# శాస్త్రవేత్తల సూచనలతో రైతులకు మార్గదర్శనం

## అధిక దిగుబడుల కోసం శాస్త్రీయ సాగు పద్ధతులపై అవగాహన



**బూర్గంపహాడ్ మహా :** రైతుల అభివృద్ధి, ఆధునిక సాగు పద్ధతుల విస్తరణ లక్ష్యంగా ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని కొత్తగూడెం కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) సౌజన్యంతో రైతులతో ఇష్టాగోష్టి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు పాల్గొని రైతులకు సమగ్ర మార్గదర్శనం అందించారు.ఈ సందర్భంగా రైతులకు యూరియా సమర్థ వినియోగం, పంట మార్పిడి ప్రాముఖ్యత, సాగులో పాటించాల్సిన మెలుకువలు వివరించారు. పంటల దిగుబడిని పెంచేందుకు నేల పరిస్థితులకు అనుగుణంగా పద్ధతులు మార్చుకోవాలని సూచించారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై నేరుగా చర్చించి, వారి సందేహాలకు సమాధానాలు ఇచ్చారు. కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ భరత్ మాట్లాడుతూ, ఫార్మ్ స్థాయిలో సమగ్ర వ్యవసాయ విధానాలు, అంతర పంటల సాగు, కాలానుగుణ పంటల ఎంపిక ద్వారా అధిక దిగుబడులు సాధ్యమవుతాయని తెలిపారు. రైతులు ఆధునిక సాంకేతికతను వినియోగించుకోవాలని సూచించారు.జిల్లా వ్యవసాయ అధికారి వి. బాబురావు మాట్లాడుతూ, ప్రస్తుత పరిస్థితుల్లో పంట నూర్పిడి సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఎరువుల సమతుల్య వినియోగం, పచ్చి ఎరువులు, జీవ ఎరువుల ప్రాధాన్యతపై విపులంగా వివరించారు. సమగ్ర పోషక నిర్వహణ ద్వారా భూమి సారాన్ని కాపాడుకోవచ్చని అన్నారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ బొర్రా సుభ్రద, ఉప సర్పంచ్ పొక్కుల రవి, ఏడిఏ తాతారావు, మండల వ్యవసాయ అధికారి ఆర్. శంకర్, రైతులు కైపు సుబ్బిరామిరెడ్డి, గాదె నర్సిరెడ్డి, కామిరెడ్డి పద్మ, ఏఈవోలు, పలువురు రైతులు పాల్గొన్నారు.

# గోమాత దినోత్సవం సందర్భంగా వినతిపత్రాల సమర్పణ



**బూర్గంపహాడ్ మహా:**గోమాత దినోత్సవాన్ని పురస్కరించుకుని దేశవ్యాప్తంగా గోవును జాతీయ ప్రాణిగా గుర్తించాలని, రాజ్యాంగంలో గోవుకు సముచిత స్థానం కల్పించాలని, గోవధశాలలను పూర్తిగా నిర్మూలించి గోవులను రక్షించాలని కోరుతూ గోప్రచార భక్తులు, సాధువులు, పీఠాధిపతులు, గో ప్రేమికులు కలిసి మూడు నెలలుగా సంతకాల సేకరణ చేపట్టారు.ఈ సేకరించిన సంతకాలను తహసీల్దార్, జిల్లా కలెక్టర్, రాష్ట్ర ముఖ్యమంత్రి, రాష్ట్ర గవర్నర్, దేశ ప్రధానమంత్రి, రాష్ట్రపతికి వినతిపత్రాల రూపంలో సమర్పించే కార్యక్రమంలో భాగంగా సోమవారం నాడు బూర్గంపాడు మండల రెవెన్యూ ఆఫీసర్‌కు పత్రాలను అందజేశారు. అనంతరం సీఎం, ప్రధాని, గవర్నర్, రాష్ట్రపతికి ఫార్వర్డ్ చేసే విధంగా రిసీవ్డ్ కాపీలు స్వీకరించారు.ఈ సందర్భంగా సనాతన హిందూ ధర్మ గో సేవ ప్రచారకులు టి. గోవిందరెడ్డి మాట్లాడుతూ గోవును జాతీయ ప్రాణిగా గుర్తించాలని, గోవులను వధశాలలకు వెళ్లకుండా కేంద్ర ప్రభుత్వం పూర్తిగా నిరోధించాలని కోరారు. ప్రభుత్వాలు గోశాలలు ఏర్పాటు చేసి వాటికి అవసరమైన నిధులు సమకూర్చాలని సూచించారు.విదేశీ దేశాలు మన దేశం నుంచి కోట్ల రూపాయల విలువైన గోమూత్రం, గోపేడను కొనుగోలు చేసి తమ పంటలకు క్రిమిసంహారకంగా వినియోగిస్తున్నాయని, మన ప్రభుత్వాలు కూడా గో ఆధారిత ఉత్పత్తులను ప్రోత్సహించి వ్యవసాయం, మానవ ఆరోగ్య పరిరక్షణకు ఉపయోగించుకోవాలని అన్నారు. ఇందుకోసం ప్రత్యేక ల్యాబొరేటరీలు ఏర్పాటు చేసి గో ఉత్పత్తుల తయారీకి చర్యలు తీసుకోవాలని సూచించారు. "ఎక్కడైతే స్త్రీ మరియు గోవు గౌరవింపబడుతుందో, పూజింపబడుతుందో, రక్షింపబడుతుందో ఆ ప్రదేశం పాడిపంటలతో, సుఖసంతోషాలతో, ఆరోగ్యాలతో తులతూగుతుంది" అని ఋషులు పేర్కొన్నారని తెలిపారు.హిందువుగా పుట్టిన ప్రతి ఒక్కరూ సనాతన హిందూ ధర్మాన్ని కాపాడాలని, దేవాలయాలను పరిరక్షించాలని, ప్రతి ఇంట్లో భగవద్గీత, రామాయణ గ్రంథాలను ఉంచుకుని నిత్యం చదవాలని, పిల్లలకు కూడా చదివించాలని, సంప్రదాయాలు, ఆచారాలు, అలవాట్లు పాటించేలా చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సనాతన హిందూ ధర్మ గో సేవ ప్రచారకులు టి. గోవిందరెడ్డి, వి. రామారావు, పిచ్చయ్య నాయుడు, గోవర్ధన్ తదితర గోసేవ భక్త బృందం పాల్గొన్నారు.

# మక్కల కొనుగోలు కేంద్రం సందర్శన

- మక్కల కొనుగోలు వేగవంతం చేయాలి
- ఎమ్మెల్యే దొంతి, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**మహా వరంగల్ బ్యూరో;** వరంగల్ జిల్లా నెక్కొండ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన మక్కల కొనుగోలు కేంద్రాన్ని నర్సంపేట శాసనసభ్యులు దొంతి మాధవ రెడ్డి, వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సందర్శించి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, ఆర్డీవో ఉమారాణి, డీసీవో నీరజ, ఎమ్మార్వో రాజ్‌కుమార్, మార్కెటింగ్ శాఖ అధికారిణి సురేఖ, మార్కెట్ సెక్రటరీ కృష్ణ మినన్ రావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొనుగోళ్ల ప్రక్రియను వేగవంతం చేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు.మక్కల సేకరణ, తూకం, నిల్వ, రవాణా ప్రక్రియలు సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కేంద్రంలో ఏర్పాట్లు, నిల్వ సదుపాయాలను పరిశీలించిన ఎమ్మెల్యే, రైతుల నుంచి అభిప్రాయాలు తెలుసుకుని సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను కోరారు. రైతులు తమ పంటను సులభంగా విక్రయించుకునేలా అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# టెండర్ ప్రక్రియ వేగవంతం చేయాలి

## నగర మేయర్ గుండు సుధారాణి



**మహా వరంగల్ బ్యూరో;** స్పెషల్ అసిస్టెంట్ ఫండ్ ద్వారా చేపట్టబోయే అభివృద్ధి పనులకు టెండర్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని నగర మేయర్ గుండు సుధారాణి ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు.సోమవారం బల్దియా ప్రధాన కార్యాలయంలోని మేయర్ చాంబర్‌లో ఇంజనీరింగ్ అధికారులతో మేయర్ సమావేశం నిర్వహించి సమర్థవంతంగా అమలు చేయడానికి అవసరమైన సూచనలు చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టేందుకు స్పెషల్ అసిస్టెంట్ ఫండ్ కింద నిధులు మంజూరైన నేపథ్యంలో, రోడ్లు, డ్రెయిన్లు, కమ్యూనిటీ హాల్స్ నిర్మాణానికి సంబంధించిన పనులకు టెండర్ ప్రక్రియను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. అనంతరం పనులు ఆలస్యం కాకుండా వెంటనే ప్రారంభమయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.పనుల నాణ్యతను కాపాడుతూ, నిర్ణీత కాలవ్యవధిలో పూర్తి చేసేలా సమన్వయంతో పనిచేయాలని మేయర్ సూచించారు.ఈ సమావేశంలో ఈఈ సంతోష్‌బాబు, డీఈలు కార్తీక్ రెడ్డి, రంగారావు, సతీష్, రాజ్ కుమార్, రాగి శ్రీకాంత్, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.



# వైభవంగా శ్రీ భద్రకాళీ భద్రేశ్వరుల కళ్యాణ మహోత్సవం

## పాల్గొన్న మేయర్ దంపతులు

**మహా వరంగల్ బ్యూరో;**శ్రీ భద్రకాళీ భద్రేశ్వరుల కళ్యాణ మహోత్సవం 2026 కార్యక్రమం లో భాగంగా సోమవారం (8వ రోజు) సందర్భం గా వరంగల్ జిల్లా పద్మశాలి సంఘం ఆధ్వర్యం లో నిర్వహించిన వేడుకల్లో నగర మేయర్ దంపతులు గుండు సుధారాణి ప్రభాకర్ దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భం గా ఆలయానికి చేరుకున్న మేయర్ దంపతుల తో పాటు పద్మశాలి కుల బంధువులకు ప్రధాన అర్చకులు సాంప్రదాయ బద్ధంగా స్వాగతం పలికి, అనంతరం పద్మశాలి కుల బంధువులచే అర్చకులు సామూహికంగా కుంకుమ పూజ నిర్వహింపజేశారు.అనంతరం విశిష్ట అతిథిగా హాజరైన ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త రాధా మనోహర్ దాస్ సనాతన హిందూ ధర్మ ప్రాశస్త్యం గురించి వివరించారు.ఈ కార్యక్రమం లో వరంగల్ జిల్లా పద్మశాలి సంఘ ప్రతినిధులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఎల్ఆర్ఎస్ ధృవపత్రాల జారీ ప్రక్రియ వేగవంతం చేయండి

- పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి
- అనధికార లేఅవుట్లు, అక్రమ కట్టడాల పై చర్యలు తీసుకోవాలి
- నగర మేయర్ గుండు సుధారాణి

**మహా వరంగల్ బ్యూరో;** ఎల్ఆర్ఎస్ ధృవపత్రాల జారీ ప్రక్రియను వేగవంతం చేయాలని గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ గుండు సుధారాణి పట్టణ ప్రణాళిక విభాగానికి చెందిన అధికారులనుఆదేశించారు.సోమవారం బల్దియా ప్రధాన కార్యాలయం లోని మేయర్ ఛాంబర్ లో పట్టణ ప్రణాళిక విభాగానికి చెందిన అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశం లో మేయర్ పాల్గొని సమర్థవంతం గా చేపట్టుటకు తగు సూచనలు చేశారు.ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ఎల్ఆర్ఎస్ ధృవపత్రాల జారీ, గ్రేటర్ వరంగల్ పరిధిలో అనధికార లేఅవుట్ల నియంత్రణ తదితర అంశాల పై సమగ్రంగా సమీక్షించి మాట్లాడుతూ ఇందుకు సంబంధించిన ప్రక్రియలను వేగవంతం చేస్తూ పారదర్శకతతో పనులు పూర్తి చేయాలని, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సేవలు అందించాలని, పెండింగ్‌లో ఉన్న ఎల్ ఆర్ ఎస్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించి, అర్హులైన వారికి మంజూరి ధృవపత్రాలను అందించాలని ఆదేశించారు.పట్టణ అభివృద్ధి నియమావళిని ఖచ్చితంగా అమలు చేస్తూ అనధికార లేఅవుట్ల పై కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో అక్రమ కట్టడాలు జరగకుండా పర్యవేక్షణను బలోపేతం చేయాలని చర్యలు తీసుకోవాలని మేయర్ అధికారులకు సూచించారు.ఈ సమావేశంలో ఇంచార్జి సిటీ ప్లానర్ రవిందర్ రాడేకర్ ఏ సి పి లు ఖలీల్ అహ్మద్ శ్రీనివాస్ రెడ్డి నస్రీన్ బాను పట్టణ ప్రణాళిక ఆధికారులు పాల్గొన్నారు.

# బల్దియా ప్రజావాణికి వినతుల విలువ

## నగర ప్రజల నుండి 111 ఫిర్యాదుల స్వీకరణ



**మహా వరంగల్ బ్యూరో;** బల్దియా ప్రధాన కార్యాలయం లోని కౌన్సిల్ హాల్ లో సోమవారం ప్రజావాణి (గ్రీవెన్స్) కార్యక్రమం జరిగింది. ఈ సందర్భం గా అదనపు కమిషనర్ చంద్రశేఖర్, ఆయా విభాగాలకు చెందిన ఉన్నతాధికారులు నగర ప్రజల నుండి వివిధ సమస్యల పరిష్కారం కోసం అందజేసిన దరఖాస్తులను స్వీకరించి పరిష్కార నిమిత్తం ఆయా విభాగాలకు చెందిన అధికారులకు అందజేశారు .ఈ సందర్భంగా స్వీకరించిన ఫిర్యాదుల వివరాలు విభాగాల వారిగా టౌన్ ప్లానింగ్.....58, ఇంజనీరింగ్.....35, రెవిన్యూ.........13, హెల్త్, శానిటేషన్.. 05, మొత్తం 111 దరఖాస్తులను పరిష్కరించాలని ఆయా విభాగాల అధికారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో డి ఎఫ్ ఓ శంకర్ లింగం ఇంచార్జి సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్ వెటర్నరీ వైద్యులు డా.గోపాల్ రావు పన్నుల అధికారి రామకృష్ణ ఎం హెచ్ ఓ డాక్టర్ రాజేష్, హెచ్ ఓ లక్ష్మారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# జనగణన నమోదు చేసుకున్న ఎమ్మెల్యే నాయిని



**మహా వరంగల్ బ్యూరో ;** జనగణన 2027 కార్యక్రమంలో భాగంగా వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి స్వీయ జనగణన లో పాల్గొని తమ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్నారు. తెలంగాణ రాష్ట్రంలో నిన్నటి నుంచి ప్రారంభమైన ఈ ప్రక్రియలో భాగంగా సోమవారం బాలసముద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జనగణన వెబ్‌సైట్ ద్వారా వివరాలను నమోదు చేశారు .ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని మాట్లాడుతూ, దేశ అభివృద్ధికి జనగణన అత్యంత కీలకమని పేర్కొన్నారు. ప్రతి కుటుంబం ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ వివరాలను సక్రమంగా నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ప్రజలందరూ స్వీయ గణనలో చురుకుగా పాల్గొనాలని కోరారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్, వార్డ్ ఆఫీసర్ నవ్య పాల్గొన్నారు.

# వికలాంగులకు త్రీ చక్ర వాహనాల పంపిణీ

- వికలాంగులు దివ్యాంగులకు అండగా ప్రజా ప్రభుత్వం
- పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



**మహా వరంగల్ బ్యూరో ;** హనుమకొండ జిల్లా బాలసముద్రంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి ఐదుగురు వికలాంగులకు త్రీ చక్ర మోటార్ వాహనాలను పంపిణీ చేశారు. ఈ వాహనాలను సీసీఆర్ నిధుల కింద ప్రత్యేకంగా అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, వికలాంగులు దివ్యాంగుల జీవన ప్రమాణాలను మెరుగుపరచడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. అర్హత కలిగిన వారికి ఉచితంగా సహాయక పరికరాలు అందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.ఇటువంటి పథకాలు వికలాంగులకు స్వయం ఆధారిత జీవనం సాగించేందుకు దోహదపడతాయని ఆయన పేర్కొన్నారు. త్రీ చక్ర వాహనాలతో లబ్ధిదారులు తమ రోజువారీ పనులను సులభంగా నిర్వహించగలరని తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# విధుల్లో చేరిన ట్రైనీ ఐఏఎస్ సాయి శివాని



**హనుమకొండ మహా;** హనుమకొండ జిల్లాకు శిక్షణలో భాగంగా ట్రైనీ ఐఏఎస్ అధికారి సాయి శివాని సోమవారం హన్మకొండ కలెక్టరేట్ లో విధుల్లో చేరారు.ఈ సందర్భంగా హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో పలువురు అధికారులు ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. శిక్షణ కాలంలో భాగంగా పరిపాలన, రెవెన్యూ, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సేవల నిర్వహణ తదితర అంశాలపై ప్రాయోగిక అవగాహన పొందేందుకు ట్రైనీ కలెక్టర్ సాయి శివాని వివిధ శాఖల పనితీరును పరిశించనున్నారు.

## ప్రజల సంక్షేమం, బాలల భద్రత కొరకు

# బాల పంచాయతీ కార్యక్రమం

## ముఖ్య అతిథిగా హాజరైన సెంట్రల్ జోన్ డిసిపి ధార కవిత



**మహా వరంగల్ బ్యూరో;** బాల పంచాయతీ ద్వారా సురక్షిత గ్రామాలను, బాల బాలికల భద్రతను నిర్మించవచ్చని వరంగల్ పోలీస్ కమిషనరేట్ సెంట్రల్ జోన్ డిసిపి ధార కవిత అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమాలలో భాగంగా ఐదవ అంశంగా బాలల భద్రత వారోత్సవాల కార్యక్రమాలలో భాగంగా వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని సంగెం మండలం తీగరాజపల్లి గ్రామం నందు తెలంగాణ పోలీస్ ఉమెన్ సేఫ్టీ వింగ్ ఆధ్వర్యంలో, మై ఛాయస్ ఫౌండేషన్, యంగిస్తాన్ స్వచ్ఛంద సంస్థల సహకారంతో తీగరాజపల్లి గ్రామంలో బాల పంచాయతీ కార్యక్రమం గ్రామ సర్పంచి గోపాల్ అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ యొక్క కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన సెంట్రల్ జోన్ డిసిపి ధార కవిత హాజరై మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర పోలీస్ ఉమెన్ సేఫ్టీ వింగ్ తదితరుల ప్రభుత్వ శాఖలు ఆధ్వర్యంలో బాల పంచాయతీ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని కార్యక్రమ ఉద్దేశ ప్రకారము గ్రామంలో ఉన్న 15 మంది బాలబాలికలను చైల్డ్ పార్లమెంట్ లేదా బాల పంచాయితీకి ఎంపిక చేసి అలా ఎంపిక చేయబడిన బాలలు భవిష్యత్తులో వారి సేఫ్టీ , భద్రత గురించి గ్రామ అభివృద్ధి గురించి పిల్లల భవిష్యత్తు గురించి వారు ఒక నాయకత్వ లక్షణాలు కలిగి గ్రామాల వివిధ సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించే దిశగా ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో అట్టి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని ఈ సందర్భంగా బాల పంచాయతీ ప్రతినిధులు ఐదు అంశాల పైన వారు పని చేస్తారని అన్నారు అందుకుగాను పోలీసు, ఇతర యంత్రాంగమంతా కూడా బాల పంచాయతీ ప్రతినిధులకు వాళ్ళు సమస్యలు గుర్తించడానికి వారు చూపించిన సలహాలను స్వీకరించి అట్టి వాటికి పరిష్కార మార్గాలను చూపించాలని తెలిపారు. ఈ బాలలకు బాల పంచాయతీ ప్రతినిధులకు ప్రభుత్వ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, ముఖ్యంగా తల్లి దండ్రులు ప్రజలు సహకారం అందించాలని తెలిపారు .కార్యక్రమం నందు విశిష్ట అతిథులుగా హాజరైన జిల్లా రెవెన్యూ అధికారి విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజల సంక్షేమం, బాలల భద్రత కొరకు ఏర్పాటుచేసిన ఈ బాల పంచాయతీ కార్యక్రమం తెలంగాణ రాష్ట్రంలో పైలట్ ప్రాజెక్టుగా ఈ గ్రామాన్ని ఎంపిక చేసి ఈ రోజు నిర్వహించడం జరుగుతుందని రెండు నెలల తర్వాత పిల్లలు గుర్తించిన సమస్యలను పరిష్కరించి వాటిపైన సమీక్ష సమావేశాన్ని నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమం నందు మై ఛాయిస్ ఫౌండేషన్ స్టేట్ కోఆర్డినేటర్ జన్ను క్రాంతి, ఎర్ర శ్రీకాంత్ పిల్లలకు విజన్ డాక్యుమెంట్ పైన ఓరియంటేషన్ చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో నందు మామునూరు ఏసిపి వెంకటేష్, పార్వతగిరి సీఐ. రాజగోపాల్, ఇన్స్పెక్టర్ జె శ్యాంసుందర్, షీటీం ఇన్స్పెక్టర్ సుజాత , భరోసా ఇన్స్పెక్టర్ సువర్ణ, ఎస్ఐ. ప్రవీణ్, జిల్లా సంక్షేమ అధికారి రాజమణి ,ఎఫ్ఎం సాంఘిక సేవా సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ సిస్టర్ సహాయ, కోఆర్డినేటర్ బత్తుల కరుణ, డి ఎల్ పి ఓ వేదవతి, ఎంపీ ఓ హర్షిత్, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ వసుధ తదితరుల తోపాటు ఇతర ప్రభుత్వ అధికారులు తల్లిదండ్రులు విద్యార్థులు పాల్గొన్నారు.

# శవ రాజకీయాలు మానుకోండి

- బీజేపీ,బిఆర్ఎస్ లపై ఎమ్మెల్యే నాయిని ఫైర్
- ఆర్టీసీ కార్మికులకు అండగా కాంగ్రెస్ పార్టీ



**మహా వరంగల్ బ్యూరో;** బీజేపీ, బిఆర్ఎస్ పార్టీలు దొందు.. దొందే నని చిల్లర రాజకీయాలు, శవ రాజకీయాలు చేయడం వారికి పరిపాటిగా మారిందని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మండిపడ్డారు.ప్రజా సంక్షేమం పక్కన పెట్టి వారి రాజకీయ ప్రయోజనాల కోసంప్రతిపక్షాలు 'శవ రాజకీయం' చేయడం సిగ్గుచేటని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి ధ్వజమెత్తారు. సోమవారం హనుమకొండ లోని డీసీసీ భవన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల మరణించిన ఆర్టీసీ ఉద్యోగి శంకర్ గౌడ్ కుటుంబానికి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఆర్టీసీ కార్మికుల సంక్షేమం పట్ల రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి పూర్తి చిత్తశుద్ధి ఉంది. గత పాలకులు సమస్యలను గాలి కొదిలేస్తే, తమ ప్రభుత్వం గంటల వ్యవధిలోనే స్పందించి కార్మికులకు భరోసా కల్పించిందని ఆయన గుర్తు చేశారు. కేంద్ర మంత్రి హోదాలో ఉన్న నాయకులు చిల్లర రాజకీయాలకు పాల్పడటం దురదృష్టకరమని నాయిని విమర్శించారు. బీజేపీ నేతలు, ముఖ్యంగా బండి సంజయ్ ఆ కార్మికుడి కుటుంబానికి కనీస సాయం కూడా చేయలేదని అధికారంలో ఉండి రాష్ట్రానికి ఏమీ చేయనివారు, ఇప్పుడు మొసలి కన్నీరు కారుస్తున్నారని బిజెపికి శవ రాజకీయం మత రాజకీయం' తప్ప అభివృద్ధి తెలియదని, రానున్న రోజుల్లో ఆ పార్టీకి ఉన్న ఒక ఇంజన్ కూడా పోవడం ఖాయమని ఆయన ఎద్దేవా చేశారు. మామునూరు ఎయిర్పోర్ట్ విషయంలో కేంద్రం గతంలో ఎందుకు జాప్యం చేసిందో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీ ఆస్తులను అమ్ముకున్న చరిత్ర బీఆర్ఎస్ అని, అలాంటి వారు ఇప్పుడు కార్మికుల గురించి మాట్లాడటం హాస్యాస్పదమని అన్నారు. 20 ఏళ్లుగా జిల్లాను వెనక్కి నెట్టిన ఆ పార్టీ నాయకులు ఇప్పుడు కపట నాటకాలతో ప్రజల ముందుకు వస్తున్నారని అన్నారు. ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వరంగల్ జిల్లా కార్మికుల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఏ సమస్య వచ్చినా పరిష్కరించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# క్రికెట్ ప్రియులకు బౌలింగ్ పై ఉచిత శిక్షణ

## భజరంగ్ క్రికెట్ అకాడమీ చైర్మన్ గోవింద్ సింగ్



**మహా వరంగల్ బ్యూరో;** వరంగల్ జిల్లాలోని క్రికెట్ పై ఆసక్తి గల స్కూల్, కళాశాల విద్యార్థులకు అలాగే క్రికెట్ ప్రియులకు భజరంగ్ క్రికెట్ అకాడమీ వారు అద్భుతమైన అవకాశాన్ని కల్పిస్తున్నారు.క్రికెట్ లో బౌలర్లు కావాలనుకునే వారు (ఫాస్ట్ స్పిన్) భజరంగ్ క్రికెట్ అకాడమీలో ఉచిత శిక్షణను ఇవ్వనున్నారు. వరంగల్ లో మొట్టమొదటి ఇండోర్ అకాడమీగా పేరుపొందిన ఈ సంస్థ, ప్రతిభావంతులైన యువతకు ఉచిత శిక్షణ ఇవ్వనుంది. ఈ సందర్భంగా శిక్షణకు ఎంపికైన వారికి ఏడాది పాటు ఉచిత శిక్షణ ఉంటుందని వీరికి ప్రత్యేకత క్రికెట్ స్కిల్స్‌తో పాటు స్పెషల్ ట్రైనింగ్ అండ్ ఫిట్‌నెస్ పై ప్రత్యేక శిక్షణ ఇవ్వబడుతుందని అకాడమీ చైర్మన్ గోవింద్ సింగ్ తెలిపారు. దీనికి సంబంధించిన వివరాలను తెలుపుతూ వయోపరిమితి 15 నుండి 25 ఏళ్ల లోపు వారు అర్హులు అని ఎంపికల తేదీ ఏప్రిల్ 29, 30 తేదీలలో ఉదయం 10:00 గంటలకు వరంగల్ దేశాయిపేట గ్రామంలోని సికేఎం మైదానంలో కోచ్ హెచ్ సీఏ శప్రతినిధి గోవింద్ సింగ్ పర్యవేక్షణలో శిక్షణ ఉంటుందని ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 9949659114 నంబర్ ను సంప్రదించగలరని కోచ్ ఓ ప్రకటనలో తెలిపారు.

# ఫస్ట్ టైం హీరోగా పాయల్ బాయ్‌ఫ్రెండ్..




'ఆర్ఎక్స్ 100'తో టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చి..తొలి మూవీతోనే తెలుగు యువత మనసు దోచుకున్న బ్యూటీ పాయల్ రాజ్‌పుత్. అంతకు ముందు పంజాబీలో సినిమాలు చేశారు. హిందీ సీరియళ్ల లో నటించారు. అయితే, అక్కడ రాని గుర్తింపు... తెలుగులో ఒక్క సినిమాతో వచ్చింది. 'ఆర్ఎక్స్ 100' విడుదలైన తర్వాత పాయల్ రాజ్‌పుత్‌కు ఓవర్ నైట్‌లో స్టార్‌డమ్ వచ్చింది. అక్కడ నుంచి తెలుగులో సినిమాలు చేసుకుంటూ వెళుతున్నారు. 'మంగళ వారం'తో మరో హిట్‌ని తన ఖాతాలో వేసుకుంది. ఇప్పుడు ఈ బ్యూటీ..తన బాయ్‌ఫ్రెండ్‌ని తెలుగు తెరకు పరచయం చేయనుంది. సోషల్ మీడియాను రెగ్యుల ర్‌గా ఫాలో అయ్యేవాళ్లకు సౌరబ్ ధింగ్ర గురించి తెలిసే ఉంటుంది. పాయల్‌తో కలిసి చేసిన హాట్ ఫోటో షూట్ అప్పట్లో బాగా వైరల్ అయింది. ఆయన ఇప్పుడు 'ఫస్ట్ టైం' అనే సినిమాతో హీరోగా పరిచయం అవుతున్నా డు. ఈ చిత్రానికి హేమంత్ ఇప్పనపల్లి కథదర్శకత్వం తో పాటు నిర్మాతగానూ వ్యవహరిస్తున్నాడు. ఈ మూవీ ట్రైలర్‌ని ఈ నెల 28 విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ట్రైలర్ రిలీజ్ ఈవెంట్‌కి పాయల్ రాజ్‌పుత్ ముఖ్యఅతిథిగా రాబోతున్నట్లు సమాచారం. ఈ సినిమాలో బిగ్ బాస్' ఫేమ్ అఖిల్ సార్థక్ సెకండ్ లీడ్ గా అనిక్క విక్రమన్ హీరోయిన్ గా, ఇతర ముఖ్య పాత్రల్లో మైమ్ గోపి, శివ, భూపాల్ రాజు, గాయత్రి గుప్త, అన్నపూర్ణమ్మ, అజయ్ రత్నం, ఢీ పండు నటి స్తున్నారు. శ్రీ వెంకట్ మరియు సూరజ్ ఎస్ కురుప్ సంగీతాన్ని అందించగా వేణు మురళీధర్ మరియు రామ్ సినిమాటోగ్రాఫర్లుగా పనిచేశారు.




# మహేశ్ నిర్మించిన మూవీ.. రిలీజ్ ఎప్పుడంటే?

ప్రస్తుతం 'వారణాసి' సినిమాతో మహేశ్ బాబు బిజీగా ఉన్నాడు. వచ్చే ఏడాది ఏప్రిల్ తొలి వారంలో ఇది థియేటర్లలోకి రానుంది. కానీ ఇంతకంటే ముందే మహేశ్ ఓ మూవీతో రాబోతున్నాడు. కాకపోతే ఇది ఈయన నటించిన చిత్రం కాదు నిర్మాతగా వ్యవహరించినది. ఇప్పుడీ సినిమాకు సంబంధించిన రిలీజ్ డేట్ ప్రకటించారు. కేరాఫ్ కంచరపాలెం, ఉమా మహేశ్వర ఉగ్రరూపస్య తదితర సినిమాలతో దర్శకుడిగా మంచి పేరు తెచ్చుకున్న వెంకటేశ్ మహా తీసిన లేటెస్ట్ మూవీ 'రావు బహదూర్'. సత్యదేవ్ హీరోగా నటించాడు. గతేడాది ఆగస్టులోనే టీజర్ రిలీజ్ చేయగా ఆసక్తికరంగా అని పించింది. కొన్నిరోజుల క్రితం తొలి పాట రిలీజ్ చేశారు. ఇప్పుడు విడుదల తేదీని ప్రకటించారు. జూన్ 5న థియేటర్లలోకి తీసుకురాబోతున్నట్లు అధికారికంగా పోస్టర్ వదిలారు. జీఎంబీ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై మహేశ్‌బాబు, నమ్రత.. ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నారు. శ్రీ చక్రాస్ ఎంటర్‌టైన్‌మెంట్స్, ఎ ప్లస్ ఎస్ మూవీస్ సంస్థలపై చింతా గోపాలకృష్ణారెడ్డి, అనురాగ్ రెడ్డి, శరత్‌చంద్ర నిర్మిస్తున్నారు. ఓ రాజవంశం నేపథ్యంలో సాగే ఈ సినిమాని సైకలాజికల్ థ్రిల్లర్ డ్రామాగా తెరకెక్కిస్తున్నారు.

# పుట్టినరోజుకి ముందు సమంత సంచలన పోస్ట్



తెలుగులో ఒకప్పుడు స్టార్ హీరోయిన్‌గా వెలుగు వెలిగిన సమంతని ఇప్పుడెవరూ పెద్దగా పట్టించుకోవట్లేదు. అడపాదడపా మూవీస్ చేస్తున్న ప్పటికీ.. వాటి కంటే విడాకులు, ఆరోగ్య సమస్యలు, రెండో పెళ్లి తదితర అంశాలతో ఎప్పటికప్పుడు వార్తల్లో నిలుస్తూనే ఉంది. ఈమె లీడ్ రోల్ చేసిన 'మా ఇంటి బంగారం' మరో రెండు వారాల్లో రిలీజ్ కానుంది. అలానే మంగళవారం ఈమె పుట్టినరోజు కూడా. ఇంతలోనే చిన్నపాటి షాకిచ్చింది. తన దగ్గర ఇప్పుడేముంది? వేటిని వదులుకున్నానని ఓ పోస్ట్ రూపంలో బయటపెట్టింది. పని మీద ప్రేమ, నడిపించే శక్తి, మనసు చెప్పే విషయం, సంకల్పం, నమ్మిన నిజం, ఓ లక్ష్యం తనతో పాటు ఉన్నాయని చెప్పుకొచ్చిన సమంత.. ఎవరో వచ్చి ఎంపిక చేస్తారని ఎదు రుచూడటం, నియంత్రించే ఆలోచన, నచ్చినట్లు ఉండాలనుకునే లక్షణం, పట్టుకుని వేలాడటం, హడావుడి పడటం లాంటి అంశాలని వదిలేశానని తెలిపింది. ఇందుకు సంబంధించి నాలుగు ఫొటోలని ఇన్‌స్టాలో పోస్ట్ చేసింది. చూస్తుంటే సమంత.. గత కొన్నేళ్లలో తన జీవితంలో జరిగిన సంఘటనలు, వాటి వల్ల తనలో వచ్చిన మార్పుల గురించి పరోక్షంగా ఈ పోస్టుతో చెప్పే ప్రయత్నం చేసినట్లు అనిపించింది. ఇక 'మా ఇంటి బంగారం' విషయానికొస్తే.. నందిని రెడ్డి దర్శకత్వం వహించిన యాక్షన్ మూవీ ఇది. ఓ ఇంటికి కోడలిగా వచ్చిన హీరోయిన్(సమంత).. రౌడీలని ఎందుకు చితక్కొట్టాల్సి వచ్చిందనేది కాన్సెప్ట్. ఈ చిత్రానికి సామ్ భర్త రాజ్ నిడిమోరు స్టోరీ, నిర్మాణ పరంగా సహకారం అందించారు.



# సాయి పల్లవి చాన్స్ కొట్టేసిన రుక్మిణీ వసంత్!

దివంగత ప్రఖ్యాత గాయని, భారతరత్న అవార్డుగ్రహీత ఎంఎస్ సుబ్బులక్ష్మి జీవితం ఆధారంగా ఓ సినిమాకి సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ బయోపిక్‌కు 'జెర్సీ' సినిమా ఫేమ్ గౌతమ్ తిన్ననూరి దర్శకత్వం వహించ నున్నారని, గీతా ఆర్ట్స్ సంస్థ నిర్మాణంలో భాగస్వామిగా ఉంటుందనే టాక్ ఫిల్మ్‌నగర్ సర్కిల్స్‌లో వినిపిస్తోంది. అలాగే ఎంఎస్ సుబ్బులక్ష్మి పాత్రలో సాయి పల్లవి నటిస్తా రనే టాక్ తొలుత వినిపించింది. కానీ ఇప్పుడు ఈ చాన్స్ కన్నడ నటి, 'కాంతార' ఫేమ్ రుక్మిణీ వసంత్‌ను వరించిం దని టాక్. 'రామాయణ' (రెండు భాగాలుగా రానున్న సినిమా), ధనుష్ కొత్త చిత్రంలో సాయి పల్లవి హీరోయి న్‌గా నటిస్తున్నారు. దీంతో కాల్షీట్స్ సర్దుబాటు చేయలేక ఎంఎస్ సుబ్బులక్ష్మి సినిమా నుంచి సాయి పల్లవి తప్పుకో వాల్సి వచ్చిందట. ఆ చాన్స్ రుక్మిణీ వసంత్‌కి వెళ్లిందని సమాచారం. మరి... ఎంఎస్ సుబ్బులక్ష్మి బయోపిక్‌లో రుక్మిణీ వసంత్ ఫైనలైజ్ అవుతారా? వేచి చూడాల్సిందే.



# అతని కోసమే నేను ఇండస్ట్రీలోకి వచ్చాను..



టాలీవుడ్ 'చిట్టి' ఫరియా అబ్దుల్లా తన మనసులో దాచుకున్న ఒక సీక్రెట్‌ను బయటపెట్టింది. సాధార ణంగా హీరోయిన్లు తమ ఫేవరెట్ హీరోల గురించి చెబుతుంటారు, కానీ ఫరియా మాత్రం ఏకంగా తన ఇండస్ట్రీ ఎంట్రీకి ఒక హీరోనే కారణమని చెప్పి అందరినీ ఆశ్చర్యపరిచింది. ఆ హీరో మరెవరో కాదు.. మలయాళ కుర్రాడు, పాన్ ఇండియా స్టార్ దుల్కర్ సల్మాన్. తాజాగా ఒక ఇంటర్వ్యూలో ఫరియా మా ట్లాడుతూ.. తన సినీ ప్రయాణం వెనుక ఉన్న ఆసక్తిక రమైన విషయాన్ని పంచుకుంది.. 'నేను మొదటిసారి 'ఛార్లే' (Charlie) సినిమా చూసినప్పుడు, అందులోని హీరోయిన్ పాత్రలో నన్ను నేనే ఊహించుకున్నాను. ఆ క్షణం నుంచే దుల్కర్ సల్మాన్‌పై నాకు ప్రత్యేకమైన అభిమానం ఏర్పడింది. నిజం చెప్పాలంటే, ఆయన్ని ఒక్కసారి కలవాలనే కోరికతోనే నేను ఇండస్ట్రీలోకి వచ్చాను. ఆయన స్క్రీన్ పై కనిపిస్తే చాలు ఫిదా అయిపోతాను. ఆయన నటన, స్టైల్ అంటే నాకు చాలా ఇష్టం' అంటూ తన 'ఫ్యాన్ గర్ల్' మూమెంట్‌ను షేర్ చేసుకుంది. ఫరియా చేసిన ఈ కామెంట్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతున్నాయి. ఇది చూసిన నెటిజన్లు 'త్వరలోనే ఫరియాదుల్కర్ కాంబోలో ఒక సినిమా రావాలి' అంటూ కామెంట్స్ చేస్తున్నారు. ఇక ఫరియా ప్రస్తుతం తరుణ్ భాస్కర్ హీరోగా నటిస్తున్న 'గాయపడ్డ సింహం' చిత్రంలో హీ రోయిన్‌గా నటిస్తోంది. అలాగే మరికొన్ని క్రేజీ ప్రాజెక్టు లు ఆమె చేతిలో ఉన్నాయి. ఒకవైపు నటిగా రాణిస్తూనే, మరోవైపు మ్యూజిక్ వీడియోలు, డ్యాన్స్‌లతో సోషల్ మీడియాలో నిత్యం యాక్టివ్‌గా ఉంటోంది.

# హీరోగా రజనీకాంత్ మనవడు.. కొడుకు సిల్వర్ స్క్రీన్ ఎంట్రీపై ధనుష్ క్లారిటీ ఇదే!

భాషతో సంబంధం లేకుండా స్టార్ హీరోల వారసుల ఎంట్రీ కోసం అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తుంటారు. తాజాగా కోలీవుడ్ స్టార్ ధనుష్ పెద్ద కొడుకు యాత్ర సినిమాల్లోకి ఎప్పుడు వస్తాడనే చర్చ నెట్టింట జోరుగా సాగుతోంది. ఇదే సమయంలో స్వయంగా ధనుష్ తన కొడుకుని హీరోగా పరిచయం చేయబోతున్నారంటూ గత కొన్ని రోజులుగా ప్రచారం కూడా జరుగుతుంది. ఈ తరుణంలో ధనుష్ తన కొడుకు సిల్వర్ స్క్రీన్ ఎంట్రీపై స్పష్టతనిచ్చారు. తాజాగా నిర్వహించిన కర ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో పా ల్గొన్న ధనుష్‌ను తన కొడుకు సినిమా ఎంట్రీ గురించి ప్రశ్నించగా.. ఆయన ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "మా కుటుంబ పరిస్థితుల దృష్ట్యా నేను కేవలం 16



ఏళ్ల వయసులోనే ఇండస్ట్రీలోకి అడుగుపెట్టాను. ఇప్పుడు యాత్ర వయసు 19 ఏళ్లు. అయినప్పటికీ తను నాకు ఇంకా చిన్న పిల్లోడిలాగే కనిపిస్తున్నాడు. భవిష్యత్తులో తను ఏమవుతాడో నాకింకా తెలియదు. సినిమాల్లోకి వస్తాడా? లేక మరో రంగంలోకి వెళ్తాడా? అనేది ఇప్పుడే చెప్పలేను" అని ధనుష్ పేర్కొన్నారు. నిజానికి యాత్రకు ఇప్పటికే సోషల్ మీడియాలో భారీ ఫాలోయింగ్ ఉంది. తన స్టైలిష్ లుక్స్‌తో తండ్రికి తగ్గ వారసుడు అనిపించుకుంటున్నాడు. అయితే ధనుష్ మాటలను బట్టి చూస్తుంటే, యాత్రను హీరోగా చూడ టానికి అభిమానులు మరికొంత కాలం వేచి చూడక తప్పదనిపిస్తోంది. మరోవైపు ధనుష్‌హీరోగా నటించిన లేటెస్ట్ మూవీ 'కర' రిలీజ్‌కు రెడీ అయ్యింది. విఘ్నేశ్ రాజా దర్శకత్వంలో తెరకెక్కిన ఈ పీరియాడికల్ యాక్షన్ థ్రిల్లర్ మూవీపై భారీ అంచనాలు ఉన్నాయి. ఈ చిత్రం ఈ నెల 30న తెలుగు, తమిళ భాషల్లో రిలీజ్ కానుంది.

# ఈ సినిమా సక్సెస్ కాజల్‌కి అవసరం

టాలీవుడ్‌లో స్టార్ హీరోలతో వరస సినిమాలు చేసి హీ రోయిన్‌గా గుర్తింపు తెచ్చుకున్న కాజల్ అగర్వాల్.. ఇప్పుడు పూర్తిగా వెనకబడిపోయింది. అప్పుడెప్పుడో 2017లో వచ్చిన 'నేనే రాజు నేనే మంత్రి'లో అద్భుత మైన యాక్టింగ్ చేసి హిట్ కొట్టింది. తర్వాత చేసిన వాటిలో మూడేళ్ల క్రితం 'భగవంత్ కేసరి' మాత్రమే సక్సెస్ అందుకుంది. ఇందులో ఈమెది పెద్దగా గుర్తింపు లేని పాత్ర కావడం వల్ల హిట్ క్రెడిట్ రాలేదు. గతేడాది రిలీజైన 'కన్నప్ప'లో పార్వతి దేవిగా కనిపిం చింది గానీ వర్కౌట్ కాలేదు. ఓ రకంగా చెప్పాలంటే కాజల్ కెరీర్ చివరి దశలో ఉంది. ఇలాంటి టైంలో ఈమె లాయర్‌గా లీడ్ రోల్ చేసిన 'ద ఇండియన్ స్టోరీ' సినిమా విడుదలకు సిద్ధమైంది. లెక్క ప్రకారం గతేడాది ఆగస్టులోనే రిలీజ్ చేస్తామని ప్రకటించారు కానీ షూటింగ్ ఆలస్యం కావడంతో వాయిదా వేసు కున్నారు. గతేడాది అక్టోబరులోనే షూటింగ్ పూర్తవ గా ఇన్నాళ్లకు రిలీజ్ డేట్ ప్రకటించారు. జూలై 24 నుంచి తెలుగు, తమిళ, హిందీ భాషల్లో ఈ సినిమా రిలీజ్ కానుందని పోస్టర్ వదిలారు. ఇందులో కా జల్‌తోపాటు మరాఠీ స్టార్ నటుడు శ్రేయస్ తల్పడే ప్రధాన పాత్ర చేశాడు. పంటకు ఉపయోగించే రసా యనాల దుర్వినియోగం, సాగులో పురుగు మందుల మితిమీరిన వినియోగం, దీని వెనకున్న భారీ కుం భకోణాల నేపథ్యంగా ఈ మూవీని తెరకెక్కించారు. ఇండస్ట్రీలో ఉండాలి, ఇంకా మూవీస్ చేయాలను కుంటే మాత్రం ఇది హిట్ కావడం కాజల్‌కి చాలా కీలకం. ఒకవేళ ఇది సక్సెస్ అయితే ఇంకొన్ని ఆఫర్స్ వస్తాయి. లేదంటే మాత్రం మెల్లగా ఈమెని పట్టించు కోవడం దర్శకులు తగ్గించేస్తారు. చూడాలి మరి ఏం జరుగుతుందో?

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com